# దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు?

1) దేవునియొక్క మంచితనము మనకు తెలియదు గనుక దేవుని గూర్చి తప్పుగా భావించుటకు మనకు సందులేదు. ఆయన గుణములు అనాది గుణములు అవి ఎవరికి తెలియవు. దేవదూతలకును తెలియవు ఆ గుణముల ప్రకారముగా ఆయన కొన్ని పనులు చేసియున్నారు. దేవదూతలను, ఆకాశమును, భూమిని, ఏదేనుతోటను, ఆది దంపతులను మొదలగు వానిని కలుగజేసియున్నారు. ఆయన పరిశుద్ధుడు గనుక ఆయన చేసిన సమస్తమును పరిశుద్ధములైనవి ఆయన పరిశుద్ధుడు ఆయన కార్యములు పరిశుద్ధములైనవి. అని ఎరిగి మనము పాపపతనము తరువాత కలిగిన చెడుగునుబట్టి ఆయనయందున్న మంచి అభిప్రాయమును చెడగొట్టుకొనకూడదు. ఆయన లక్షణములు చెప్పుటలో తెలియవుకాని ఆయన చేసిన కార్యములనుబట్టి తెలిసికొనగలము. పాపము ప్రవేశించి నేటికి ఆరువేల సంవత్సరములు అయినది. అప్పటినుండి పాపకార్యములు జరుగుచున్నవి. అయినప్పటికిని దేవుని మంచి కార్యములు జరుగుట ఆగలేదు. పాపకార్యములు జరుగుచుండగా దేవుని మంచి కార్యములు ఆయన మంచిగుణములు, ఆ తరువాత వచ్చిన మంచి కార్యములు మనకు తప్పుగా కనబడును. ఎందుకంటే మన పాపకార్యములు వాటికి అడ్డుగా నున్నవి. పాపకార్యములు, దేవుని మంచి కార్యములు ఈ రెండు ప్రవాహములుగా వచ్చుచున్నవి. ఆయన మంచికార్యములు, మంచి గుణములు ఎప్పటివి. అనాదివి మనము తప్పుగా భావించుచున్నాము. ఆయన చేసిన పనిలో పాపము ప్రవేశింపగా ఆయన ఎందుకు ఊరుకొనుచున్నారు? అది బాగుగాలేదు అనుచున్నారు. అట్లనుటనుబట్టి ఆయనను, ఆయన మంచి కార్యములను, ఇప్పటి మంచి కార్యములను కొట్టివేయుచున్నారు. ఎందుకు ఊరుకొనుచున్నాడు అంటే ఆయనకు తెలియక ఊరుకొనుచున్నాడు అని అనుచున్నారు. ఇంత కుమ్మరము వచ్చునని తెలిసి ఉంటే ఆ చెట్టునే వేయకుండును అని ఒక వేదాంతి

అన్నాడు మనమునూ అట్లే అనుచున్నాముగాని బహిరంగమునకు అనుటలేదు మనము ఆవిధముగా అనుటకు సందులేదు. దూతలు, ఆకాశము, భూమి, దంపతులను చేయుట గొప్పపనులేగాని పాపము ప్రవేశించిన తరువాత నేటివరకుకూడా గొప్ప కార్యములు జరుగుచునేయున్నవి. ఆకాశము ఒక విందు భూమి ఒక విందు. ఆది తల్లిదండ్రులు ఒక విందు. మనకు ఇట్టి గొప్ప విందులుండగా తప్పు అర్ధము చేసికొనుటకు వీలులేదు. పాప పతనము తరువాత రక్షణ విందు ఏర్పరచెను, పైవాటికంటే మించిన విందు రక్షణవిందు కనుక ప్రభువునుగూర్చి అపార్ధము చేసికొనరాదు. మనుష్యులు చేసిన విందుకు వంక ఉన్నది, గాని తండ్రిచేసిన విందుకు వంక శంకలేదు. వడ్రంగి కుర్చీచేసి, ఎవరూ చూడకముందే బాగుగా కుదిరినదని తనకు తాను మెచ్చుకొని తరువాత అమ్మును. అట్లే ప్రభువు కూడా భూమ్యాకాశములను సమస్తమును కలుగజేసి ఆయన చేసిన పనిని ఆయనే చూచి ఇది చాలా బాగున్నదని మెచ్చుకొనెను. ఆయన పనిని పాపము ప్రవేశించిన తరువాత ఆయన నియమించిన రక్షణ కార్యము నెరవేరుచుండగా ఆ రక్షణను గ్రహించి అనుభవించుట మనిషి వంతు. కుర్చీ బాగున్నదని మెచ్చుకొనుట వండ్రంగి వంతు. అది కొన్నవాడు వాడుకొని బాగున్నదని మెచ్చుకొనుట వారి వంతు. ఆలాగే మనము రక్షణ పొందిన తరువాత ప్రభువు పని బాగున్నదని మెచ్చుకొందుము. ఆయన సృష్టిని మెచ్చుకొన్నట్లు మనము రక్షణ కార్యకార్యక్రమమును మెచ్చుకొనవలెను పాపము ఒకదరినుండి వెళ్లుచుండగా రక్షణ కార్యక్రమము మరొక దరినుండి వెళ్లుచుండగా అది మెచ్చుకొన్న మనము ఇదెందుకు మెచ్చుకొనకూడదు? పాపము జరుగుటచూచి మనమెందుకు దేవుని మెచ్చుకొనకూడదు? భూమ్యాకాశములను రక్షణను ఇచ్చినందున దేవునిని మెచ్చుకొన్న మనము పాపము జరుగుటచూచి ఊరుకున్న దేవుని మనమెందుకు మెచ్చుకొనకూడదు? ఎందుచేత ఊరుకొనుచున్నాడు? ఏమి చేయవలెనో తెలియకనా? లేక తోచకనా? ఏమిటి? ఎందుకో ఊరుకొనుచున్నాడు. ఊరుకొని, ఊరుకొని, అడ్డుపెట్టవలసి వచ్చినప్పుడు అడ్డుపెట్టును.

# దేవుడు ఊరుకొనుటకు గల కారణములు

1. మనిషిని కలుగజేసి, మనిషికి చెప్పవలసినవన్నీ చెప్పినందున ఊరుకొనెను. ఆ చెట్టు పండును తినవద్దని దేవుడు మనిషికి చెప్పిన తరువాత మనిషి దానిని తిన్నాడు. గనుక మనిషిదే నేరము. ముందు ఆ మాట వారికి చెప్పని యెడల ఆయనదే నేరమైయుండును, చెప్పినందున దేవుడు నేరస్థుడుకాడు గనుక మనిషి తనలోనికి పాపమును రానివ్వకూడదు జలప్రళయమునుగూర్చి దేవుడు నోవహుచేత ప్రజలకు చెప్పించెను. అయిననూ ప్రజలు వినలేదు, ఓడలోనికి రాలేదు. చెప్పించిన దేవునిదా? చెప్పిన నోవహుదా? చేర్చుకొనని నావదా? రాని ప్రజలదా తప్పు! రాని ప్రజలదే తప్పు. ప్రజలు నోవహు చెప్పిన సంగతి విననందున వాన చెప్పవలసినది చెప్పెను. చెప్పినను మనిషి వినుటలేదు గాన దేవుడు చెప్పుట మానివేయును.

2. దేవుడు మనిషిని కలుగజేసినప్పుడే ఆయనయొక్క లక్షణములను మనిషిలో ఉంచివేసెను. అట్టి దేవుని లక్షణములు గల మనిషి పాపమును రానివ్వకూడదు. పాపము దేవునిలోనికి వెళ్ళబోతే ఆయన రానియ్యడు దేవుని గుణములు ఆ పాపమును దేవునిలోనికి రానియ్యవు. ఇతనిలో (మనిషిలో) దేవుని గుణములు ఉన్నవి గాన పాపమును రానియ్యకూడదు గనుక మనిషి దేవునిని తప్పు అర్థము చేసికొనుటకు సందులేదు.

3. మనిషిలో దేవుని లక్షణములున్నవి. తెలుసుకునే జ్ఞానమున్నది. విడిచిపెట్టుటకు మనస్సాక్షి ఉన్నది. మనిషి ఎప్పుడూ పాపము చేయకుండ పై మూడు స్వరములు ఏకముగా పనిచేయుచునే ఉండును. ఈ మూడు చెప్పిననూ మనిషి వినలేదు గాన మనిషి తనను తానే నిందించుకొనవలెను. గాని దేవుని నిందించరాదు. దేవుడు పెట్టిన వీటిని దేవుడు తీసివేయడు ఇవి అన్యులలోను, నామకార్థపు క్రైస్తవులలోను, విశ్వాసులలోను ఉన్నవి. వీనినిబట్టి పాపము నెదిరించి పాపము చేయకుండ ఉండగల స్థితిని దేవుడు మనిషిలో ఉంచినాడు.

# స్వతంత్రత

4. స్వతంత్రత దేవుడు అన్ని గుణములు ఇచ్చినట్లు స్వతంత్రతను కూడా ఇచ్చినాడు. దేవునిలో స్వతంత్రత ఉన్నది. మనిషిలోను స్వతంత్రత ఉన్నది. దేవుడు స్వతంత్రత కలిగి ఎట్లు మెలగుచున్నాడో అట్లే మనిషి మెలగవలెను. మనిషిలో స్వతంత్రత, పవిత్రత ఉన్నవి. త్రియేకత్వము, అనాది, అనంతము, నిరాకారము, జీవము, పరిశుద్ధత, ప్రేమ, శక్తి, న్యాయము, స్వతంత్రత, సర్వవ్యాపకత్వము దేవునిలోనున్న ఈ గుణము లన్నియు మనిషిలోను ఉన్నవి. స్వతంత్రత అనే లక్షణము మనిషిలో లేకపోతే మిగిలినవన్నియు ఉన్ననూ ఒక్కటే లేకపోయినను ఒకటే, స్వతంత్రత లేకపోతే దేవుని లక్షణములు అందుకొనలేము. అందుకొనలేకపోతే మెల్లగా కూర్చుండవలసినదే. బల్లమీద అన్ని రకములైన పండ్లు, మిఠాయిలు పెట్టి ఒకరిని పిలిచి, పిలిచిన ఆయన ఊరకుంటే వచ్చినవ్యక్తి ఊరకనే ఉండును. విందు యజమాని వచ్చి నీకు కావలసినవి తీసుకొనుమనగా తీసికొనును దానిపేరే స్వతంత్రత. దేవుడు ఆదాము అవ్వలను పిలిచి ఈ పండ్లు నిరభ్యంతరముగా తినండి ఆటంకము చేయననెను ఇదే స్వతంత్రత. విశ్వాసులతోను, అవిశ్వాసులతోను అన్యులతోను జ్ఞానము, మనస్సాక్షిద్వారా దేవుడు చెప్పినను అవి చాలుటలేదని జ్ఞానము, మనస్సాక్షి చెప్పిన దానికంటే ఎక్కువగా చెప్పుటకును కంటికి కనబడుటకును దేవుడు ఒక ఉపాయము పన్ని వాటన్నింటిని ఒక పుస్తకములో వ్రాయించెను అదే బైబిలు వివరించుచున్నది. ఇది రెండు భాగములు.

1) చేయుము 2) చేయవద్దు. మంచి కార్యములు చేయుము అవి బైబిలులో నున్నవి. దుష్టకార్యములు చేయవద్దు అది బైబిలులోనే ఉన్నవి. ఆ చండాలపు మాటలన్నియు బైబిలులోనేయున్నవి. మంచివి వ్రాసినారు సరేగాని చెడ్డకార్యములెందుకు వ్రాయించెను? అని విద్యార్థులనుచున్నారు. చెడ్డవి వ్రాయించకపోతే అవి తెలియవుగాన వ్రాయించెను అతడు చెడ్డపాపమున్నదని తెలుపుటకు వ్రాయించెను. ఇవి తినండి. ఇవి తినవద్దు అన్నచోటే బైబిలంతా ఉన్నది. చేయుమన్నది చెప్పి,

చేయవద్దన్నది చెప్పకపోతే మనిషి బేలా (దుష్టుడు/చెడ్డవాడు) అయిపోతాడు. అందుకే దేవుడు జ్ఞానముద్వారా, మనస్సాక్షిద్వారా, బోధకులద్వారా చెప్పించుచున్నాడు. మనిషి తన ఇష్టప్రకారము చేయవచ్చును. ఇది స్వతంత్రత. మనిషి మంచిపండ్లు యొద్దనుండి చెడ్డపండ్లయొద్దకు వెళ్ళినప్పుడు దేవుడు ఆపుచేసిన యెడల మనిషియొక్క స్వతంత్రత ఆగిపోవును. అంటే అంతా ఆపుచేసినట్లే. తీగెలాగితే డొంకంత కదులును. మెయిన్ స్విచ్ నొక్కితే అన్ని దీపాలు ఆరిపోవును. అట్లే స్వతంత్రతను ఆపితే అన్ని లక్షణములు ఆగిపోవును గాన అడ్డము పెట్టడు అడ్డము పెట్టిన యెడల మనిషి నశించును. దేవుడే అడ్డము పెట్టిన యెడల తానే స్వయముగా మనిషిని చంపిన వాడగును. అందుకనే దేవుడు ఊరుకొనెను. మనిషి పాపములో పడి ఆ తరువాత ప్రభువా! అంటే ఆ మనిషిని లేవనెత్తుకొనునుగానీ పాపముచేయకుండ అడ్డుపెట్టడు పాపములో పడనిచ్చును. తప్పిపోయిన కుమారుడు పందులవద్ద పశ్చాత్తాపపడెను. తండ్రి మేడమీదనుండి చూచి ఎందుకు పడ్డావని అనలేదు, గానీ ఆ పందిలాంటి వానిని ముద్దుపెట్టుకున్నాడు సబ్బుతో స్నానముచేయించి, పౌడరురాసి, శుభ్రమైన బట్టలువేసి, నున్నగా తల దువ్వించి ఆ తరువాత ముద్దుపెట్టుకొనవలసినది. గానీ అట్లు చేయక ముందే ముద్దుపెట్టుకొనెను. అట్లే ప్రభువా! అంటే ముద్దు పెట్టుకొని, ఎత్తుకొని తీసికొనివెళ్లును. మనిషిపైకి గత్తరగా నున్నను లోపల బాగుగా నున్నాడు. అందుకు తండ్రివైపు తిరిగినందున ముద్దుపెట్టుకొనెను. పైకి బాగుగా లేకపోయినను లోపల బాగున్నాడు. పైకి చింపిరి గుడ్డలు, చింపిరి తల అయినను తండ్రి చేర్చుకొన్నాడు. నన్ను నీ సేవకునిగా చేర్చుకొనుమనెను. ఇదే మంచి బుద్ధి ఎంత గొప్ప బుద్ధి? ఇట్టి మంచిబుద్ధి. గొప్ప శుద్ధిగలిగినవారిని రేపు ప్రభువు ముద్దుకొనును.

# పరతంత్రత

మనిషికి ఇది లేకపోతే చాల చిక్కే. నాయనా ఆ పండు తినమంటున్నావు ఇవి వద్దన్నావు, ఆ చెట్టుమీద ఎవడో ఉన్నాడు. ఆ పండ్లు తినమంటున్నాడు, ఏమి చెయ్యమంటావని అడగవలసింది.

అట్లడుగుటయే పరతంత్రత. స్వతంత్రత గల హవ్వ, ఆదాము తండ్రిని చూచి ఎవడో తినమంటున్నాడని అడుగవలెను. గాని అట్లు అడుగక తనమీదనే ఆనుకొని ఆ పండ్లను తినెను. అదే స్వతంత్రత తనమీద అనుకొనుట స్వతంత్రము దేవునిమీద అనుకొనుట పరతంత్రత. తప్పిపోయిన కుమారుడు గుఱ్ఱమునెక్కి యింటివద్ద బయలుదేరినది మొదలు పందులవద్దకు వచ్చువరకు స్వతంత్రుడు తండ్రియొద్దకు వెళ్లి కూలివానిగాగానీ పాలివానిగాగాని చేర్చుకొనుమని అందుననుకొనుట పరతంత్రత చేర్చుకొనుటే కావలెను. అదే పరతంత్రము పాపశోధన వచ్చినప్పుడు దేవునిని అడిగిన స్వతంత్రతను ఆపుజేయుటకాదు. స్వతంత్రతకు పరతంత్రము సహాయముచేయును. ఇది లోకములో నున్న వారందరికి చెప్పిన పాపము ఆగిపోవును. బోధకులు బైబిలు గ్రంథమును వివరించుచున్నారు. వారేకాదు. ఇంకకొందరు బోధకులున్నారు. 1. తెగులు 2. కరువు 3. ఆపద. వీరు గొప్ప బోధకులు. జబ్బు వచ్చినప్పుడు దేవుని ప్రార్థించుచున్నారు. జబ్బులేకపోతే దేవుని తలంచడు. పాపము వలన వచ్చిన అపకారము ఒక ఉపాధ్యాయుడు. తప్పిపోయిన కుమారునికి పొట్టు చూడగానే 4. ఆకలి అయినది. యజమాని పందులకు మేత పెట్టెనుగాని అతనికి పెట్టలేదు. అప్పుడు తండ్రి జ్ఞాపకమునకు వచ్చినాడు. కుష్ఠరోగి ప్రభువా! నీ కిష్టమైతే నన్ను శుద్ధినిగా చేయగలవనెను. ఇప్పటివరకు ఎక్కడ ఉన్నాడు. స్వతంత్రతలోనే ఉన్నాడు. ప్రభువును ప్రార్థించెను అదే పరతంత్రము. ప్రభువు అతని తప్పును ఎత్తలేదుగాని బాగుచేసెను. జబ్బువల్ల, కరువువల్ల, కష్టమువల్ల ప్రభువును సమీపింతురు. ఇది మేలే అదే పరతంత్రము. ఆపద రాగానే తెలియని రీతిగా ప్రభువును ప్రార్థింతురు. ముందు ఆపద మ్రొక్కులు మ్రొక్కుదురు గానీ తరువాత ఆపదను ఆపుచేసే మ్రొక్కులు మ్రొక్కుదురు. కరువు, ఆపద, జబ్బు వచ్చిన విసుగుకొనవద్దు. దేవునివైపు తిరగండి అది పరతంత్రము. పాపమువల్ల, కీడు, జబ్బులు తెచ్చుకొందురు. అది స్వతంత్రత ఆ కుమ్మరము వలన దేవునివైపు తిరుగుదురు. అదే పరతంత్రత. దేవునిమీద ఆనుకొనుట విశ్వాసపద్ధతి. మనిషిని దేవుడు ఏర్పరచిన ఆ మనిషిమీదకూడా ఆనుకొనకూడదు.

దేవునిమాదనే ఆనుకొనవలెననునది “బైబిలు మిషను” సిద్ధాంతము. తప్పిపోయిన కుమారుని కొరకు తండ్రిచేసిన విందులో సేవకులు, పశువును వధించి విందు సిద్ధము చేసిరి. విందు తండ్రి చేయించెను. సేవకులుకాదు, కాకులద్వారా ఏలియాను దేవుడు పోషించెను. గాన ఏలియా దేవుని ఏర్పాటుమీద ఆనుకొనెను గాని కాకులమీద ఆనుకొనలేదు. దేవుని యెడల కృతజ్ఞత గల ఏలియా దేవుడు పంపిన కాకులయెడల కృతజ్ఞత గలవాడై యుండెను. మీకు ఎవరైన కానుక ఇస్తే దేవుడు ఇచ్చినాడని దేవుని స్తుతించి మనిషికి వందనములు చేయండి. మనిషి ద్వారా దేవుడు ఇచ్చెను. కాంతి సృష్టిలోన సూర్యునిద్వారా దేవుడు మనకు ఇచ్చెను. రక్షణ మనిషిద్వారా వచ్చెను ఆ మనిషి దేవునికిని మనుష్యులకును మధ్యవర్తియైన దేవనరుడైన యేసుక్రీస్తు. 1తిమోతి. 2:5. దేవుడు కొన్ని ఇస్తాడు ఇతరులద్వారా ఇప్పిస్తాడు. అది పరతంత్రము. దేవుడు పంపలేదు మా అన్న పంపెను అనెను. అన్నమీద ఆనుకొనుట, దున్ని ఉడ్చిన పండినది గానీ దేవుడు ఇవ్వలేదు అన్నట్టున్నది. ఎవరు ఏది ఇచ్చినా దేవుడు ఇచ్చినాడు అనుకొంటే పరతంత్రము బైబిలు మిషనువారు దేవునిమీద అనగా పరతంత్రముమీద పూర్తిగా ఆనుకొనవలెను. స్వతంత్రము మీదకూడా ఆనుకొనవలెను.

**ప్రార్థన:–** ఓ తండ్రీ! బల్లమీద మాకు కావలసినవన్నీ పెట్టినావు భూమి, ఆకాశము, గ్రంథమును పెట్టినావు. ఈ బల్లమీద తుదకు ప్రభు భోజన బల్లమీద చాల విలువైనవి పెట్టినావు. మేము అనుభవించుట నీకు చాల ఇష్టము. మా స్వతంత్రతను, పరతంత్రతను బాగుగా వాడుకొను కృప అనుగ్రహించుమని త్వరగా వచ్చుచున్న ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

ప్రభువా! నీ లక్షణములను గూర్చి మేము విన్నది నిజమే అని తెలిసికొన్న మాకు నీవు బయలపడినావు. అనాది, అనంతము మహిమగల వాడవని గ్రహించి వందించు కృప దయచేయుము ఔను, ప్రభువా! నీకు వందనములు చెప్పునట్లు మంచి మనస్సు దయచేయుము. దయగల

ప్రభువా! నీవు మంచివాడవు గనుక నీవు చేయునదంతయు సరిగా నున్నదని మేము అనుకొన్నప్పుడు దానిని చెడగొట్టే అభిప్రాయము వచ్చిన లోబడకుండ శక్తి దయచేయుము. నీవు స్వయముగా చేసినపని మేము స్వతంత్రముగా చేసినపని, నీవు చేయనిచ్చిన పని, నీ స్థితి, నీకార్యము విని బలపడే బలమునిమ్ము. ఓ ప్రభువా! అదేదనగా పాపము ప్రవేశించినపడు నీవు అడ్డపెట్టలేదు అడ్డుపెట్టకుండ ఊరుకునే పని పరిశుద్ధమైన పని. మరియు మా స్వతంత్రతను శుద్ధిచేయు పని ఆయన ఊరుకుండుట వల్ల ఊరుకున్నాడని విసుగుకొనకుండ చేయునదై యున్నది. జరిగేదేదో ఆయన సెలవులేకుండ జరుగదని సంతోషించే కృప దయచేయుము. ఈ ప్రార్థన త్వరగా వచ్చుచున్న యేసునామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

# త్రియేకత్వము

త్రియేకత్వమును ప్రభువు మనకిచ్చెను. ఆయనయొక్క లక్షణములలో ప్రతి లక్షణమును తీసికొని వాటితో మనిషిని చేసినాడు కాబట్టి ఆ గుణములే మనిషిలోనున్నవి ఒకటి మాత్రము క్రొత్తది చేసినాడు. అదే శరీరము. దేవునికి లేనిది శరీరమును అన్ని గుణములు ఇచ్చినంత మాత్రమున మనిషి కాలేదు. గనుక శరీరము ఇచ్చినాడు. ఇప్పుడు మనిషి అయ్యెను. తన స్వరూపమందు మనిషిని చేసెనని మోషే వ్రాసెను. శరీరముతోను, దేవుని లక్షణములతో దేవుడు మనిషిని చేసెను. శరీరమును లక్షణములుగల గుత్తిని కాపాడేటందుకు దంపతులను కలుగజేసి దీవించెను. శరీరమును, దైవలక్షణములుగల గుత్తిని కలిపి మూడుగా చేరెను. 1) శరీరము 2) జీవము 3) ఆత్మ. 1థెస్స. 5:23 శరీరము, ప్రాణము, ఆత్మగలదే మనిషి. ఇదే త్రియేకత్వము. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ ఎట్లు త్రియేకత్వమో అట్లే శరీరము, ప్రాణము, ఆత్మ కలిసి త్రియేకత్వమైనాము. ఇది ఒకరకము శరీరము లేనిది మరొక రకము అది దైవత్రిత్వము. శరీరము ఉన్న మనకు ఇదే ఒక త్రిత్వము. ఈ విషయములో మనము దేవుని కుమారులమై యున్నాము. తల్లిదండ్రుల

లక్షణములు పాపము చేయకుండ ఉన్నట్లు మన లక్షణములుకూడ పాపము చేయకుండ ఉండవలెనుగానీ అట్లులేవు. అట్లు పాపము చేయకుండుట న్యాయము గానీ ఇది నెరవేరలేదు కానీ వెయ్యేండ్ల పరిపాలనలో నెరవేరును. నేను ఇచ్చిన లక్షణముల పని జరుగలేదు. ఎప్పటికయినా చేయుదునని దేవుడు ఆరవేల సంవత్సరములు ఊరుకొని ఏడవ వెయ్యిలో నెరవేర్చును. పాపముచేయు తలంపు ఉండదు. పాతదైన శరీరము పోయి క్రొత్త శరీరము వచ్చును. వృక్ష ఫలములకు ఆశపడినందున శరీరము చెడిపోయినది గాని వెయ్యిసంవత్సరములలో చెడిపోదు. దేవుని కోరిక ఎప్పటికైన నెరవేరకపోదు. దేవుడు తానుద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదు. యోబు. 42:2 ఎవరు దేవుని చిత్తమునకు లోబడుదురో వారికి నెరవేరును. ఎవరు ఈ బోధను నమ్మెదురో వారికి ఆ భాగ్యము కలుగును, గనుక మీరు నమ్మువారును, కోరువారునై యుండవలెను. మనలో త్రియేకత్వము దేవుని లక్షణము ఉన్నప్పుడు మనవేం దేవుండ్లమైనామని ధర్మశాస్త్రములో నున్నదని ప్రభువు పలికెను. యోహాను. 10:34 కీర్తన. 8:6 మనము దైవముల మెట్లయినాము? త్రిత్వమున్నది గనుక దైవములమైనాము. మీరు దైవముల దేవునికుమారులు అని ప్రభువు పలికెను. ఎందువలన అనగా ఆ త్రిత్వము, దైవలక్షణములు ఉన్నందున దేవుళ్ళము. యెహోవా కుమారులము, కుమారునికి తండ్రియొక్క లక్షణములు, రూపము కలిగినట్లే మనమును దేవుని లక్షణములు రూపము గలవారము గనుక దేవుండ్లము దేవునికంటే గొప్పవారముకాము. తండ్రి లక్షణములుగల కుమారుడు ఉన్నాడు. తండ్రికంటే కుమారుడు తక్కువ. తండ్రి ముందు కుమారుడు వెనుక, తండ్రి ఎక్కువ. ఒక విధముగాచూస్తే దేవునివంటి వారము. దేవునికంటే తక్కువ దేవుని కుమారులము. ఆయన లక్షణములున్నవి గాన ధన్యులము. భాగ్యవంతులము పాపములో పడినందున దౌర్భాగ్యులమైనాము. వెయ్యి సంవత్సరముల పాలనలో ధన్యమైన స్థితి వచ్చును.

**అనాది:-** దైవ లక్షణములన్నీ అనాదిలో ఉన్నవి. అనంతములోను అన్నీ ఉన్నవి. న్యాయముగల తండ్రి గనుక న్యాయము ఏమిటంటే అన్నీ ఇవ్వవలెను. న్యాయములో శక్తి ఉన్నది తనకున్నవి ఇవ్వగల శక్తి ఇవ్వగలడనీ జ్ఞానవంతుడని గ్రహింపగల జ్ఞాన దానశక్తి.

**ప్రేమ:-** ఇది వివరించుట చాల కష్టము. ప్రేమ అంటే యోహాను. 3:16 1) ఇచ్చెను 2) వచ్చెను. ఇదే ప్రేమ మనకు కావలసినవి ఇచ్చెను. ఆకాశము, భూమి అన్నీ ఇచ్చెను. ఇవ్వడమేకాదు. ఆయన వచ్చి వేసెను ఇచ్చుట+వచ్చుట. రెండు కలిపితే ప్రేమ. దేవుడు ఆదాము హవ్వలను కలుగజేయక ముందు భూమిని ఇల్లుగాను, సూర్యచంద్ర నక్షత్రము దీపములుగాను, అన్నీ ఇచ్చి ఆయన అక్కడ ఉండలేక వారివద్దకు వచ్చివేసినాడు. అనగా పాపము వచ్చిన తరువాత విచారించి నాలుగువేల సంవత్సరములు జరుగనిచ్చి శరీరమును ధరించుకొని కన్యకా గర్భమందు పుట్టెను. అన్నీ ఇచ్చివచ్చెను. పాడైతే వచ్చెను. రేపు సంఘము తీసికొని వెళ్లుటకు వచ్చును. పై లోకమునకు వెళ్లిన తరువాత పోగొట్టుకొన్నవన్నీ ఇచ్చును. *"అంతయు మనదే కదా - యేసుని కున్నదంతయు మనదే గదా- అంతయు మన ప్రభువు ఆర్జించి యున్నాడు. స్వంతమని అందుకొనుడి. మీ యాత్మకు శాంతి జెందనీయుడి".*

**1. తోట రాక:-** రక్షకుడుగా వచ్చెదనని ఆదాము హవ్వలకు తోటలో చెప్పెను.

**2. తొట్టి రాక:-** తొట్టిలోనికి శిశువుగా వచ్చెను.

**3. మేఘ రాక:-** సంఘమును కొనిపోవుటకు రెండవమారు మేఘములోనికి వచ్చును. సర్వత్ర అంటే అన్ని స్థలములలో వ్యాపించి యుండుట ఇది మనిషికి లేదు. మనిషి ఎక్కడ ఉంటే అక్కడే. అయితే దేవుడు ఈ లక్షణమును వెయ్యి ఏండ్ల పాలనతో మనకు ఇచ్చును. ఒకే సమయములో అమెరికాకు పరలోకమునకు, ఇండియాకు ఎక్కడకైనా వెళ్ళుదుము. నిముషములో అరనిమిషములో కాదు. రెప్పపాటు కాలములో ఎక్కడికైనను వెళ్ళగలము. ఎక్కడకు బడితే అక్కడకు ఎప్పుడు బడితే

అప్పుడు వెళ్ళగలము. దేవుడు సర్వవ్యాపి. అది దేవుడు మనకు ఇచ్చినాడు. అది మట్టిమీద నున్నప్పుడు తెలియలేదు ఇప్పుడు తెలియును. యోహాను 14:20 తండ్రితో కుమారునితో మనము ఏకమైయున్నామని ఆ దినమున ఎరుగుదుము అక్కడ తెలియును. ఇక్కడ తెలియదు. క్రొత్త సంగతి చెప్పుదును చెప్పితే శత్రువులగుదురు. (ఇది అయ్యగారి అనుభవములోని సంగతి) "కునుకుపాట్లు వచ్చినవి ఆపుకున్నాను. ఎక్కువైనవి పండుకున్నాను. కట్టె మంచముమీద అట్లే ఉన్నదిగాని అప్పుడు దూతలు నా ఆత్మను తీసికొని వెళ్ళి కలకత్తాలో నిద్రలో ఉన్న ఒక ఆత్మకు నన్ను కనబరచెను" అని చెప్పిరి. అనేకమందికి అయ్యగారు కనబడుచున్నారు. శరీరము మంచముమీదనే ఉండును గాని ఆత్మ పరలోకమునకు అక్కడక్కడకు వెళ్ళును. ఇదే సర్వవ్యాపకత్వము ఒకచోట ప్రార్థన కూటము జరుగుచుండెను. ఆ కూటములోనికి అయ్యగారి ఆత్మ వెళ్ళెను. కొలస్స. 2:5 ఇది సర్వవ్యాపకత్వము దేవుడు న్యాయస్థుడు ఇదికూడ మనకు ఇచ్చెను. దేవుడు మనలను గొప్పగా ఎంచుకొనుచుండగా విచారము, దుఃఖము, నిరాశ, భయము ఎందుకు? దేవుడు అన్ని ఇచ్చినాడు గాన అన్నీ పుచ్చుకొని హాయిగా నుండండి. ఏదైనా పాపముంటే ఒప్పుకొని క్షమాపణ పొందుట న్యాయము. పాపము చేయుట ఒక పాపము. అయ్యో పాపము చేసినాను నేను నాశనమైనాను అనుట ఇంకొక పాపము. నన్ను క్షమించునా అనుట ఇంకొక పాపము ఇట్లని దిగులు పెట్టుకొనే వారున్నారు.

**నిరాకారము:-** సర్వవ్యాపకత్వమే నిరాకారము. దేవుడు నిరాకారము నిచ్చెను. చిన్న దృష్టాంతము ఎప్పుడైనా బల్లను చూచినారా? ఎప్పుడైనా బోర్డును చూచినారా? ఎప్పుడైనా మాటను చూచినారా? మాటను చూడలేదు ఇదే నిరాకారము దేవుడు మనలో పెట్టిన నిరాకార భాగము ఆత్మ నిరాకారము మాట ప్రాణము ఆత్మకు సంబంధించినది. అదే నిరాకారము ఇదే సంతోషము.

"సంతోషమంద రారె – మన దేవుని సంస్తుతి చేయరారే సంతోష బలముచే సర్వ కష్టములను – అంతరింపజేతుము –మన దేవుని సంతోష పరచెదము'. ॥బహుగా ప్రార్థన చేయుడి॥

ఎవ్వరు పేద అరుపులు అరచేటందుకు సందులేదు. దిగులుపడుటకు సందులేదు అందరిని రక్షణ మార్గములోనికి పిలుచుచున్నారు. నేను గొప్ప పాపిని అని తెలిసికొని ప్రభువునకు చెప్పుట మంచిదే మరియు నేను పాపినికాదు అనవచ్చును. మనలను బట్టి పాపులము ప్రభువునుబట్టి పరిశుద్ధులము. పాపాత్మురాలైన స్త్రీ, బంకి నాయన (పేతురు) పౌలుగారు, సంఘమును తరిమి నాయన ఎక్కడ నుందురు? శుద్ధియైనారు గనుక ప్రభువు బల్లయొద్ద ఉందురు. ఆలాగే భక్తులందరూ పాపులే, పరిశుద్ధులే. క్రీస్తురక్తము వలన శుద్ధి చేయబడినారు కనుక దేవుని సరసన కూర్చుందురు. మనము వెళ్ళిచూస్తే కనబడుదురు. పాపాత్మురాలు, దొంగ ఇక్కడ ఉన్నారని ఆశ్చర్యపడుదుము. గానీ అనము. అనే స్థలముకాదు. పాపముంటే దిద్దుకొనండి. దేవునిబట్టి? ఆయన లక్షణములనుబట్టి దిద్దుకొనవలెను. మనకు ఏ లక్షణము తక్కువగానుంటే ఆ లక్షణమునొద్దకు వెళ్ళి సహాయమడగవలెను. శక్తి తగ్గినందున పాపమును జయించలేకపోవు చున్నాము. గనుక దేవుని శక్తి దగ్గరకు రావలెను. జ్ఞానము లేనందున అన్నీ తెలివి తక్కువ పనులు చేయుచున్నాము. గనుక దేవుని జ్ఞానము దగ్గరకు రావలెను. చిక్కులు ఉన్నప్పుడు ఏమి చేయవలెనో తోచదు. నీకు తోచదుగానీ నీవు దేవునిమీద ఆనుకొనినయెడల నీకు తోచును. పాపము చేసినందున పరిశుద్ధత పోయినది గనుక పరిశుద్ధత వద్దకు వెళ్ళిన పరిశుద్ధత దొరుకును. ఒక క్రైస్తవుడు ఉన్నాడు. ఆయన పేరు బిల్లీ చనిపోవుచున్నాడు. అప్పుడు ఒక స్నేహితులు వచ్చి బిల్లీ! చనిపోతున్నావా? అని అంటే లేదు.....లేదు.....నేను జీవించుటకు ప్రారంభించుచున్నాను అనెను. భూలోక జీవము గందరగోళ జీవము. పరలోక జీవము ప్రభువునుబట్టి సంతోషకరమైన నిత్యజీవము. దేవునిలోనుండి ఈ నిత్యజీవమునకు వచ్చాను గనుక పరలోకమును చూచి సంతోషించాము. అనాది మనకున్నది. ఎట్లనగా అనాదియందే మనము దేవుని తలంపులో నున్నాము. అనాది అనగా ఆదికి ముందు నేను దేవదూతలను, ఆకాశమును, భూమిని తరువాత మనిషిని కలుగజేస్తాను. ఆ మనుష్యునిలోనుండి అనేకులను కలుగజేస్తాను అని ఆలోచించెను.

గనుక దీనిని బట్టి అనాదిలో మనమును ఉన్నామని అర్ధమగుచున్నది. దేవుని అనాదిని బట్టి అనంతము ఉన్నది. దేవుని అనంతమే నిత్యజీవము. మనిషి భూమిమీదనుండగా ఎన్నిసార్లు చనిపోవును? ఒక్కసారె చనిపోవును. కొందరైతే అనేకసార్లు చనిపోదురు. కష్టములు వచ్చినప్పుడెల్లా చావాలనుకొని, సుఖమున్నప్పుడు బాగా జీవించాలనుకొని ఇలా జీవితమంతా చావాలి, బ్రతకాలి అనుకొంటూ చివరకు చనిపోవుదురు (ప్రసంగి 7:14). దేవునిలోనుండి విశ్వాసులకు జీవమువస్తే ఆ జీవముతో దేవుని వద్దకు నిత్యజీవములోనికి వెళ్ళిపోవును. మనిషి ఇన్నాళ్లు నా మాటవిని ఇప్పుడు జీవములోనికి వెళ్ళినాడని మరణము నోరు ఆవలించును. "ఏమాయెను ఏమాయెను అపవాది యత్నాలు ఏమాయెను" సైతానును, కష్టములను, శరీరమును, మరణమును, సమాధినిచూచి నన్ను ఇన్ని శ్రమలు పెట్టినారు నన్ను ఏమిచేయగలిగినారు? ఇప్పుడు తుర్రున ఎగిరిపోవుచున్నానని హేళనచేసి గట్టెక్కినట్టు, పరలోమునకు వెళ్ళి శత్రువులను హేళనచేయును. 1కొరింథి. 15:55 అట్టి భాగ్యమున్నది గనుక ఎవరైన చాటున మాటున ఏడ్వవద్దు. ఏడ్పున్నయెడల సైతాను, పాపము, శాపము, వ్యాధులు, ఇబ్బందులు, మరణము, శవము ఇవన్నీ ఉన్నట్లే. ఇవి అన్నీ ఒక్క వరుసలోనిది. ఈ వరుసలో ఉంటే వచ్చేవి దుఃఖము, కన్నీరు. క్రీస్తున్నందున్న విశ్వాసికి ఆ జీవము భూమిమీద ప్రారంభించి మరణమప్పుడు సంపూర్తియగును. ఇక్కడ పొందనిదే అక్కడ ఏలాగు వచ్చును? దేవుడు మనలో జీవముపెట్టియున్నాడు. జీవముగలవారు ఏడ్వవచ్చునా? జీవము పోయిన తరువాత ఇంటిలోనివారు ఏడ్చెదరు. వెళ్ళిపోయిన జీవము ఏడ్చుచున్న వారినిచూచి, వీరు తెలివి తక్కువవల్ల ఏడ్చుచున్నారు. నాకు ఏమి? మునుపటికంటె ఎక్కువ జీవమలోనుండి హాయిగా నున్నానను. తల, మెడ, చేతులు, కాళ్లు, అవయములు, డబ్బు, మేడలు అన్నీ ఉన్నా, ఆ జీవము లేకపోతే ఏమి లాభము? జీవము లేకపోతే శవమే. దేవుడు మనకు లెక్కపెట్టలేనన్ని ఈవులను ఇచ్చియున్నాడు. ఒక డాక్టర్‌గారు ఒక పత్రికలో ఈ మాటలు వ్రాసిరి. కొందరు చదివి ఉంటారు. కొందరు చదివి మరచి ఉంటారు. దేవుడు లోకములో

కలుగజేసినవి మనిషి అనుభవించలేక పోవుచున్నాడు. అన్నీ స్వీకరింపలేకపోవుచున్నాడు. అరణ్యములో లక్షల చెట్లు, కోట్ల పండ్లు ఉన్నవి. మనుష్యులు, పక్షులు, జంతువులు తినగా మిగిలినవి భూమి పాలగుచున్నవి. తిన్నా తినకపోయినా బల్లమీద పెట్టుట ఆయన పని. ఆలాగే ఆత్మ వరములు మనము పుచ్చుకొన్న పుచ్చుకొనకపోయినా దేవుడు ఇచ్చుట నిజమే. ఆత్మ వరములు ఎన్నో ఉన్ననూ, మనము అందుకొనలేక పోవుచున్నాము. ఉన్నను స్వంత మేలుకొరకు ఇతరులు మెప్పుకొరకును వాడుచున్నాము గానీ దేవుని మహిమ కొరకు వాడలేకపోవుచున్నాము. దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు? మనిషి పాపములోపడిన యెడల దయ్యాలు, మనుష్యులు, పరుగులు పీక్కొని తింటుంటే దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు.

**కొన్ని కారణములు:-**

1) మనిషి Right about turn అవుటకు, మనిషి దేవునివైపు తిన్నగా తిరుగుటకు 2) మనిషి తాను నేర్చుకొనవలసిన నీతి పాఠములు నేర్చుకొనవలెను గాన కష్టములు రానిచ్చినందున నీతిపాఠములు నేర్చుకొనును. ఆ మనిషి తన తప్పు తాను తెలిసికొనును 3) మరికొందరి విషయములో అతడు ఇంక బ్రతికి ఉండిన పాపములో నుండి మరియొక పెద్దపాపములో పడునుగాన ప్రభువు అతనిని తీసికొనును. ఒక్కొక్క రకమునకు కోటాను కోట్లు ఉందురు. 4) విశ్వాసులు ప్రార్థన చేసిన నెరవేరదు. నిరాశలోనికి వెళ్ళుదురు. నిరాశలోనికి వెళ్ళిన దేవుడు ఆలకించడు. ఆలకించిన యెడల మనుష్యుడు దేవునికి దక్కడు గాన ఆలకించడు. వినకపోయిన అడిగినవికాక వేరే సదుపాయముచేసి కన్నీటిని తుడుచును. 5) మనిషి తాను వాడలేని వరములు కావలెనని అడిగినయెడల దేవుడు ఇచ్చిన యెడల మనిషి పాడుచేసికొనును. గాన ఇవ్వడు, వినడు. 6) మరియొకరికి తమకున్న వరమే ముఖ్యము గాని వరమిచ్చిన దాత ముఖ్యము కాదని వరముమీద ఆధారపడును. గనుక అడిగిన వరము ఇవ్వడు. కొందరు ప్రార్థించిన దేవుడు వెంటనే వినును. కొందరు ప్రార్థించిన వెంటనే వినడు ఎందువల్ల? 7) ఓపిక ఎక్కువ చేయుటకు.

గోజులాడిన స్త్రీ అనేకసార్లు న్యాయాధికారివద్దకు వచ్చినది. ఆయనకేసు విచారణ చేయనందున అనేకసార్లు వచ్చినది. గనుక ఆమెలోని ఓపిక కనబడుచున్నది. అదే సహింపు వరము. ఇది దేవుని లక్షణములలో ఒకటి. ఇది అనేకమందికి ఉండదు. కొందరికి విసుగుదల ఉండును. జడ్జిగారు ఆలస్యము చేసినందున ఆమెకు ఓపిక వచ్చినది. దేవుని లక్షణము దీర్ఘశాంతము 1పేతురు. 3:20. నోవహు కాలములోని ప్రజల విషయములో ఆ మాట వాడబడెను. ఆయన దీర్ఘశాంతము ఇంకా ఇంకా అని కనిపెట్టుచున్నది. మనకును అట్టి దీర్ఘశాంతము ఉండవలెను. 8) కొంతమంది భక్తులకు శ్రమ ఈ ప్రక్కనుండి ఆ ప్రక్కనుండి వచ్చి రెండు ప్రక్కల రెండు శ్రమలు నొక్కినప్పటికిని ఆయనకు తెలియదా! అని నిజభక్తుడు అనును. దేవా! దేవా! అని అంటావెందుకు? అని ఇతరులు అడిగితే నా సంగతి నా శ్రమనాయనకు తెలియదా! నన్ను ఎన్నడు చంపడు. నన్ను ఎన్నడు నాశనము చేయడు అని భక్తిగలవారు అన్నప్పుడు అందరు భక్తి నేర్చుకొందురు. భక్తిగలవారికి మెప్పు కలుగును. అట్టి భక్తినిచ్చిన దేవుని మెచ్చుకొందురు. ఇది కొందరికే. 9) అన్ని రకములైన శ్రమలు ఉన్నవి అవి ఎప్పటికిని పోవుటలేదు. నాలుగు కష్టములు తీసివేయమంటే ఐదవది కూడా వచ్చినది. ప్రార్థన చేసినకొలది కష్టములు ఎక్కువగుచున్నవి. ప్రార్థన చేయనంటే నీవు ప్రార్థన చేసిన దేవుడు నీకు బహుమానము ఇవ్వనైయున్నాడు. ఓపిక పట్టమని పాదిరిగారు చెప్పిన అప్పుడు ఊరుకొనును. ఓర్చుకొన్న తరువాత భూమి మీదనే ఆ బహుమానము నిచ్చును. బహుమానము నిచ్చినప్పుడు ఇన్ని శ్రమలు అనుభవించబట్టే యోబునకు వలె ఇట్టి బహుమానము వచ్చెనని అనుకొనును. ఆయుష్కాలము ఎక్కువ, ఆస్తి, పిల్లలు ఎక్కువ. మెప్పు ఎక్కువ ఇవి ఇచ్చుటకే దేవుడు శ్రమలను రానిచ్చును. 10) సైతాను సిగ్గుపడుటకు ఓ సాతానా! నా బిడ్డను నీవు ఎన్ని శ్రమలు పెట్టినను నేను ఊరుకొన్నాను. అయిననూ నా కుమారుడు విసుగుకొనలేదు. ఇక నీకు సిగ్గు అని సైతానుతో దేవుడు చెప్పును. అట్టిది అందరికి కాదు కొందరికే రానిచ్చును చివరికి సాతాను అజలేదు. 11) శ్రమవల్ల భూలోక బహుమానము వేరుగాను, పరలోకములో

మహిమ కిరీటము వేరుగాను ఉండును. స్తెఫనును హింసకులు రాళ్ళతో కొట్టినప్పుడు స్తెఫను ఆ హింసకులను శపించలేదు గాని, క్షమించు ప్రభువా! అని పలికి చనిపోయి పరలోకమునకు వెళ్ళెను. వెంటనే మహిమ కిరీటమును ధరించుకొనెను. స్తెఫను అను మాటకు కిరీటము అని అర్ధము. మీకందరకూ శ్రమలు రావలెనని నేను అనను, శ్రమరావద్దని అనను. ఒకవేళ వచ్చిన యోబువలె, స్తెఫనువలె, అపోస్తలులు పండ్రెండు మందివలె సహించిన యెడల ఈలోకములోను, పరలోకములోను బహుమానము వచ్చును. 12) రక్షణ పొందిన మనము పరలోకమునకు వెళ్ళిన తరువాత ప్రభువు మనలను కౌగిలించుకొని మహిమలోనున్న తండ్రి వద్దకు, దేవదూతలవద్దకు తీసికొనివెళ్ళి ఈ మనుష్యుడు దొరకలేదు. చివరికి దొరికెను. భూమిపై గొప్పపని చేసెనని తండ్రి ఎదుట, దూతల ఎదుటను ఒప్పుకొనును (లూకా. 15:10). అప్పుడు ఎప్పుడు వినని అల్లరి వినబడును. దేవదూతలందరూ తమరెక్కల రెపరెపలాడించి సంతోషముతో స్తుతిచేయుదురు ఇది జరిగించుటకే శ్రమ రానిచ్చును.

**ప్రార్ధన:-** దయగల తండ్రీ! శ్రమలు లేనివారు భూలోకములో లేరు. శ్రమలద్వారా మహిమోపకారముచేయు దేవుడవు. ఇట్టి శ్రమలను చూచి నీ నామధారులైనవారు ఎప్పుడైన, ఎక్కడైన ఎందుకైనా విసుగుకొంటే ఆ విసుగుదలను తీసివేసి, అట్టివారికి నీ కృపను, నీ శక్తిని, నీ సహింపును, నీ మహిమను చూపుమని యేసు నామములో వేడుకొనుచున్నాము. ఆమేన్.

## మనము కష్టములు అనుభవించుచుండగా దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు?

13) మనుష్యుడు పాపము చేసినందున అన్ని రకములైన కష్టములు వచ్చినవి, అవి ఎంతో కష్టతరమైనవిగాను, హానికరమైనవిగా నున్నట్టు మనిషికి తెలియును గాని, కష్టముకంటే పాపమెంత భయంకరమైనదో గడ్డైనదో తెలియుటలేదు. అట్లు తెలిసికొనకుండుట మనిషియొక్క తప్పు. పాపమువల్ల వచ్చిన కష్టముకంటే, సాతానువల్ల వచ్చిన

పాపమే ఎక్కువ హానికరమైనదని మనిషి తెలుసుకొనవలెను. అట్లు తెలిసికొనుటకే కష్టములురాగా చూచి దేవుడు ఊరుకొనుచున్నాడు. పాపము పొడవు ఎక్కువ. పాపఫలితమైనయున్న కష్టము కురచ అనగా మనిషి చేసిన పాపముల పరిమితికంటే కష్టముల పరిమితి తక్కువైనది.

14) పాపము చేసినందువలన కష్టము తెచ్చుకొన్నాడు. అంతేకాక తనకున్న వరముకూడా పోగొట్టుకొన్నాడు. అయినను ప్రార్థించుచునే ఉన్నాడు. అందువల్ల తనకున్న అపరాధము పరిహారమైనది తనకున్న శ్రమలో కొంతశాంతి కలిగినది, గాని తన ప్రార్థనవల్ల సంతుష్టి కలుగలేదు. తాను చేయుచున్న క్రొత్త ప్రార్థనకు నెరవేర్పు కనబడుటలేదు. ఎందుకనగా తన అపరాధములవల్లనే కష్టము వచ్చినదను నమ్మిక ఉన్నది గాని తన అపరాధము వల్లనే తనకున్న వరము పోగొట్టుకొన్నాడను నమ్మకము వచ్చువరకు పోగొట్టుకొనిన వరమును సంపాదించువరకు దేవుడు ఊరుకొనును. ఆదాము, హవ్వలకు దేవుడు ఒక వాక్యము చెప్పినాడు. ఆ వాక్యమే రెండు భాగములుగా ఉన్నది. 1) తినండి, 2) తినవద్దు.

(1) అప్పుడు దేవుని దగ్గరనున్న హవ్వ సాతాను దగ్గరకు వెళ్ళినది. (2) దేవుని వాక్యము నొద్దనున్న హవ్వ సాతాను వాక్యము దగ్గరకు వెళ్ళినది. పాపమువల్ల దేవునిని, దేవుని వాక్యమును పోగొట్టుకొన్నారు. సాతాను వద్దనుండి సాతాను వాక్యము నొద్దనుండి తిరిగి దేవుని వద్దకు దేవుని వాక్యము వద్దకు వచ్చు వరకు శ్రమలు పోవు దేవుని వాక్యము నొద్దకు, దేవుని యొద్దకు వెళ్ళవలెను. అదే కనిపెట్టు సిద్ధాంతము క్రొత్తగా తెచ్చినాము. అందుకే శత్రువులు హెచ్చయిరి. (ఆదామా నేను ఎక్కడ ఉంచితే ఎక్కడ ఉన్నావు ఆ సన్నిధి నుండి ఈ సన్నిధికి రావలెను). తప్పిపోయిన కుమారునికి తండ్రి సన్నిధిపోయి పందుల సన్నిధికి వెళ్ళినాడు. తండ్రియొద్దకు రావలెను. వచ్చువరకు ఆకలి దరిద్రతపోదు యజమానునకు పందులకుకూడా దయలేదు? తండ్రి సన్నిధికి వచ్చువరకు శ్రమలు తప్పవు.

15) దేవుని మనిషి 1) దేవునిని ప్రేమించవలెను ఆయనకు 2) భయపడవలెను 3) ఆయనను నమ్మవలెను 4) ఆయనను సేవింపవలెను. ఈ నాలుగు తన స్వతంత్రతతోనూ, ఇష్టముతోనూ చేయవలెను. మనిషి ఈ నాలుగు తన ఇష్టము చొప్పున చేయవలెను. అయితే దేవుడు బలవంతముగా ఈ పనులన్నీ చేయించుకొనగలడు, గానీ దేవునికి ఇష్టము లేదు. ఎందుకంటే అట్లు బలవంతముగా చేయుట అనగా అది మనిషి యొక్క ఇష్టము నుండి వచ్చినదికాదు. దేవుని ఇష్టమును బట్టి వచ్చినది కాదు. గనుక దానికి విలువలేదు. పంతులుగారు పిల్లవానిని కొట్టిరి. గనుక అది మేలు కొరకే కాని పిల్లవాడు ఆ కష్టముతో పంతులుగారికి సలాము చేయలేదు. మానేటరు చేయమంటే చేసెను. భయముతో చేసెను గాని ఇష్టముతోకాదు కాని ఇష్టముతో చేయవలెను. బడి విడిచిన తరువాత పిల్లలందరూ సలాము చేయుచుండగా ఈ పిల్లవాడుకూడా ఇష్టముతో సలాము చేసినాడు. ఇప్పుడు ఇష్టమైనది అట్లే మనమును దేవునికి ఏది చేసినను మన ఇష్టముతో చేయవలెను. దేవుని ఇష్టప్రకారము చేయవలెను. ఈ రెండు జరిగేవరకు దేవుడు ఊరుకొనును. కష్టములో ఇష్టముతో వందనము చేయవలెను. మనము అట్లు ఇష్టముతో చేయువరకు కష్టములు తొలగవు. కష్టముల వలన నష్టములేదు గాని తర్ఫీదు గలదు. పైకి కష్టమేగాని లోపల నష్టములేదు. సముద్రము పైన కొన్ని గజములవరకు కెరటముల వలన అల్లరి విస్తారముగాని లోపల అంతా నెమ్మది. అట్లే మనకు వచ్చే కష్టములు పైకి అల్లరేగాని లోపల హాయిగాను ఆనందముగాను ఉండును. శరీరమునకు, జీవమునకు ఆత్మకు బుద్ధివచ్చును. ఆత్మపోయి పరమాత్మతో కలిసిపోవునట్టి అనుభవము వచ్చును. గనుకనే కష్టమువచ్చినప్పుడు దేవుడు ఊరుకొనును.

16) హేబెలును కయీను చంపెను. హేబెలునకు శరీరము ప్రాణము ఆత్మ పోయినది. ఆదాము హవ్వలకు కొడుకుపోయెను. కయీనునకు తమ్ముడు పోయెను. దేవునికి క్రొత్త కొడుకు దొరికెను. అన్న తనను చంపేటప్పుడు తమ్ముడు పారిపోలేదు. దేవునికి క్రొత్త వరుసలేదు గాన తప్పించుకొనలేదు. అందువలన హేబెలు లోకములో హతసాక్షియైనాడు

(మత్తయి. 23:35) హేబెలు తన పాపమునుబట్టి మరణించలేదు. ఆదాము హవ్వ కయీను వారి పాపమును బట్టి చనిపోయిరి. ఇప్పుడు కుమారుడు రెండు ముక్కలుగా పడియుండుటయు, రక్తమువలన భూమి తడిసియుండుటయు చూచిరి.

ఈ పండు తిను దినమున నిశ్చయముగా చచ్చెదరని దేవుడు చెప్పిన ఆ చావును ఇప్పుడు కన్నులారా చూచిరి. ఇదేవారు మరణమును మొదటిసారి చూచుట. పాపమునుబట్టి మరణము తప్పదని తెలిసికొను చున్నాము. హేబెలు లోకములో రాబోవు హతసాక్షులకు మానేటరు. హేబెలుచేసిన తప్పు ఏమిటి? తప్పుగాదుగాని దేవునికిని తనకును అంగీకారమైన మంచి కానుకను తెచ్చెను. ఆ కానుకను దేవుడు అంగీకరించెను. అందుచేత నీతిమంతుడైన హేబెలు అనిపేరు వచ్చినది. హెబ్రీ. 11:4. హేబెలు గొఱ్ఱెపిల్లను దేవునికి సమర్పించెను. ఆ గొఱ్ఱెపిల్ల దేవుని గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు ప్రభువునకు ముంగుర్తు. ఈ ముంగుర్తయిన గొఱ్ఱెపిల్లను అర్పించిన హేబెలు దేవునికొరకు హతసాక్షియైనందున, దేవుని గొఱ్ఱెపిల్లయైన క్రీస్తుప్రభువునకు ముంగుర్తుగా అర్పించబడిన దేవునిగొఱ్ఱెపిల్లగా ఎంచబడెను. దీనిని శ్రమలలో చేర్చకూడదు. హతసాక్షులలో చేర్చవలెను. అయిననూ మనము తాత్కాలికముగా శ్రమలలో చేర్చక తప్పదు. నరకబడుట హతసాక్షుల లెక్కలోచేర్చబడుటకే హతసాక్షులకు ప్రత్యేకమైన గౌరవమును పరమభక్తులకు లేని గొప్ప బహుమానమును పరలోకములో ఉండును. క్రీస్తుప్రభువునకు ముంగుర్తుగా తన రక్షణ కొరకును ఇతరుల రక్షణ కొరకును హతసాక్షులు ప్రాణమునర్పించిరి. క్రీస్తుప్రభువు మన అందరికొరకు తన ప్రాణము నర్పించెను. కయీను, హేబెలును చంపునపుడు దేవుడు వచ్చి కయీను గొంతు పట్టుకొంటే హేబెలు చావు తప్పునుగాని దేవుడు తప్పించలేదు. తప్పించినయెడల హేబెలునకు ఆ గొప్ప పేరురాదు. కయీనుకు చెడ్డపేరురాదు. అందుకే దేవుడు ఊరుకొనెను. ప్రకటనలో అయ్యగారు హతసాక్షులను గూర్చి వివరముగా చెప్పిరి.

17) శ్రమలలో ఉన్న అందరు వినండి. శ్రమలంటే ఏమనగా దయ్యము కలలోకనబడి భయపెట్టి బాధపెట్టుట పాపము చేయించుట, జబ్బు, ఇబ్బంది, కష్టము తెచ్చిపెట్టినది ఇవన్ని మనిషి అసహ్యించు కొన్నాడు. ఇది రెండవరకమైన హత సాక్ష్యము. మొదటి హతసాక్షులు హటాత్తుగా చనిపోదురు. కాని ఇదైతే కొన్ని సంవత్సరములు శ్రమపడుదురు. రోగులను ఉచితముగా బాగుచేయు స్వస్థిశాలకు వచ్చువరకు ఈ రెండు హతసాక్ష్యముండును. దీనికి బహుమానము దొరుకును. ప్రది దినము కష్టములననుభవించుట. రెండవ రకమైన హతసాక్షి వరుసలోనికి వచ్చును. నాకు హతసాక్షి లెక్కవద్దు అంటే కష్టము పోవును గాని కిరీటముండదు. 1) నీతి కిరీటము 2 తిమోతి. 4:8. 2) జీవకిరీటము యాకోబు. 1:12. 3) మహిమ కిరీటము 1పేతురు. 5:4. 4) అక్షయ కిరీటము 1కొరింథి. 9:25. 5) అతిశయ కిరీటము 1థెస్స. 2:19. ఏడు రకములైన కిరీటములున్నవి. హతసాక్షి ప్రభువు బాగుచేయు స్వస్థిశాలకు వెళ్ళవలెను. వెళ్ళినను బాగుపడకపోతే 1) పాపమునుబట్టి బాగుపడపోవచ్చును. 2)రెండవ రకమైన హతసాక్షి కిరీటమును పొందుటకై బాగుపడకపోవచ్చును దేవుని ప్రోగ్రాము అయ్యేవరకు మనిషి ఊరుకొనక కిరీటము వద్దు అంటే బాగు చేయవచ్చును. లేక బాగుచేయక పోవచ్చును. దేవుని పద్ధతులు వేరు గనుక మనము 1) సహించుచు 2) ప్రార్థించుచు 3) నమ్ముచు 4) స్తుతించుచు 5) కనిపెట్టుచు ఊరుకొనవలెను. సన్నిధిలో గదిలోకాదు గదిలోనున్న సన్నిధికాదు. "సన్నిధిలో" ఈ వర్తమానమును అయ్యగారు సన్నిధిలోనుండి అందించుచున్నారు గది సన్నిధి వేరు (అయ్యగారు ప్రభువు. ప్రభువు అయ్యగారు ఉన్న సన్నిధివేరు) ఈ సన్నిధిలో నుండుట కష్టము. అయ్యగారు సన్నిధిలో ఉన్నందున ఇట్టి సంగతులను తెలియజేయుచున్నారు. ప్రభువు అయ్యగారితో మాట్లాడుచున్నారు. అయ్యగారు ఒక దొరగారు కలిసి పక్కలంక వద్దనున్న తాడిపూడి వెళ్ళిరి. దొరగారు అయ్యగారిని ప్రసంగించమనగా ప్రసంగించిరి. చెప్పేటప్పుడు ఎదురుగా ఉండి ఒక ముసలాయన ప్రసంగమంత విని వెనుకకు తిరిగి మనకు ఏమియు తెలియలేదురా అన్నాడు. ప్రసంగము వివరమంతా సున్న, నీవు తెలుగు

మనిషివి. ఆయన తెలుగు మనిషి మీరుచెప్పినదే అర్థముకాకపోతే నేను చెప్పితే వారికింకేమి అర్థమగును? అని దొరగారు చాలా నిరాశపడ్డారు. కష్టాలలోనున్న వారికి అనగా ఊరగాయవలె కష్టాలలో ఊరే వారికి అర్థము కాదు. ఇక్కడనున్న వారందరూ విశ్వాసులా? అవిశ్వాసులా? ఇక్కడకు రావడమే విశ్వాసము. మీరు విశ్వాసులైతే ఈ చరణము పాడకూడదు. ''కడు బీదవాడనంధుడను, దౌర్భాగ్యుడను చెడిపోయిపడియున్నాను సుడివడిన నామదికి స్వస్థత చెడిన కనులకు దృష్టిభాగ్యము–బడయవలసినవన్నీ నీచేబడయుటకు నాయొడయుడాయిదే ॥ఉన్నపాటున॥ అందులోఎన్ని ఉన్నవి (పాపముల జాబితా) 1) కడుబీదవాడను 2) అంధుడను 3) దౌర్భాగ్యుడను. నీవు కడు బీదవాడవా? దేవుడు నీకు ఏమి తక్కువ చేసినాడు? గ్రుడ్డివాడవా? బైబిలు చదువుటలేదా? భాగ్యములేని వాడవా? చెడిపోయినవాడవా? మంచివాడవుకావా? పడిపోతే ఇక్కడికి ఎలా వచ్చావు? ఒక మనసుకు స్వస్థతలేదా? ఇన్ని ఉంటే మీరెందుకు విశ్వాసులు కారు? ఇదికాదు విశ్వాసులు పాడదగినది.

"దరిలేని ఆనందకరమైన నీ ప్రేమ తరమే వర్ణన చేయనూ – తెరవు కడ్డంబైన యన్నిటి విరుగగొట్టెను గాన నేనిపుడరుదుగానీవాడనవుటకు మరి నిజము నీవాడనవుటకే" ॥ఉన్నపాటున॥

18) ఓ ప్రభువా! ఈ దినము ప్రార్థన చేయబోతే ప్రార్థన రావడములేదు. బైబిలు చదవాలంటే ఇష్టములేదు. ఎందుకో గందరగోళముగా నున్నది. నన్ను నేను పరిశీలించుకొంటే నేను పాపము చేసినట్టు కనబడుటలేదు. కారణము తెలియుటలేదు. గనుక ప్రభువా! నా మీదికి కష్టములు పంపించుము. బైబిలు చదువుటకు ఇష్టము పుట్టును. కష్టములు రానిచ్చిన సహించలేవని ప్రభువనెను. నేను సహిస్తాను. ప్రభువా పంపుమనెను. అప్పుడు కష్టము వచ్చెను. కష్టము రాగా రద్దీగా ప్రార్థన వచ్చెను. వాక్యము ఎక్కడతీసినా కాంతిగానే కనబడుచుండెను. ఈలాగు జరిగెను. ఇట్లు ఎవరు చేయగలరు. ఇట్లు చేసిన యెడల అందున్న మేలును గుర్తింపవచ్చును.

ప్రార్థన:- ఓ కనికరముగల తండ్రీ! ఇప్పుడు మాట్లాడుకొన్నవన్ని అందుకొని ఆనందించేటట్లును మాశక్తికొలది బోధల ప్రకారము నడిచే శక్తి, ఆసక్తి దయచేయుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు? ఎందుకు ఊరుకొన్నాడంటే ఆయన గుణములు మనకు ఇచ్చివేసినాడు. గనుక ఊరుకొనుచున్నాడు. అందులో ముఖ్యముగా స్వతంత్రత ఇచ్చినందున ఊరుకొన్నాడు. ఈ రెండు కాక ఒకసంగతి చెప్పినాడు. ఇది తినండి అది తినవద్దు తింటే మరణము అని చెప్పినాడు. కనుక ఊరుకొన్నాడు. తన రూపమును తన స్వభావమును తన లక్షణములను తన ఆజ్ఞను ఇచ్చినాడు గాన ఊరుకొన్నాడు తన ఆజ్ఞను మీరినందున వచ్చే నష్టమును చెప్పినాడు. గనుక ఊరుకొన్నాడు. ఈ నాలుగు ఈ పదనెనిమిదిలోఇవే. ఈ పదునెనిమిది కారణములను ఊరుకొనకపోతే ఆయనను ఏమి చేయమంటారు? 19) ప్రార్థన చేసినా కష్టము తీసివేయలేదు, తప్పించలేదు అంటే తీసివేసేవరకూ నీవు ప్రార్థన చేయవలెను. తీసివేయకపోయినను మనస్సులోనైననూ సంతోషము కలిగించును. సంతోషము కలిగించుట ఒక జవాబు, తీసివేయుట మరియొక జవాబు ప్రార్థించు వింటాను అన్నారు గాన ఈ రెండు ఏమగును? ప్రార్థన నెరవేరకపోతే మనలో ఏదో పొరబాటు ఉన్నదని గ్రహింపవలెను, ప్రార్థించండి వింటాను అని చెప్పిన ఆయన వాక్యము ఎల్లప్పుడు పనిచేయును మానదు, మారదు. ఆ రెండు కొట్టివేసిన యెడల దేవుని కొట్టివేసినట్లే. ప్రభువా! నాలో లోపము ఏదో చూపించుము. దిద్దుకొందునని ప్రభువునడిగిన ప్రభువు చెప్పును. అందుకే సన్నిధి అవసరము. దేవుడు ఊరుకొనుచున్నాడని సంతోషించవలెను. దేవుడు ఊరుకొన్నాడని మనము సంతోషించి ఊరుకొనవలెను. ఈ రీతిని దేవుడు మనమును ఊరుకొనుట ఐకమత్యము. 1) సహోదరులు 2) ఐక్యతకలిగి 3) నివసించుట ఎంత మేలు, ఎంత మనోహరము కీర్తన. 133:1. సహోదరుల ఐక్యతయే ఎంతో మేలు, ఎంతో మనోహరము అయిన ఎడల దేవుడును, మనిషి ఐక్యత కలిగి ఉన్న ఇంకెంతమేలు, ఇంకెంత మనోహరము. తండ్రి, ఉమార, పరిశుద్ధాత్మ ముగ్గురు ఒక్కరే ఇది

త్రిత్వములోని ఐక్యత అది మనకుకూడా ఉన్నది. మనమెన్ని వందలమంది ఉన్నా దేవుని లెక్క ఒక్కరే, అదే ఐక్యత. త్రిత్వములోనుండి ఇది వచ్చినది. మన ఐక్యత ఎక్కడ ఉన్నా ఉన్నంతసేపైనా బేధాభిప్రాయములు, విసుగుదల, కీచులాటలు లేకుండ ఉండవలెను. తండ్రి ఏమిచెప్పునో అదే కుమారుడును పలుకునని ప్రభువు చెప్పెను ఇదే ఐక్యత. యోహాను. 3:34 5:19 14:23-24 పరిశుద్ధాత్మను పంపుదును ఆయన మాటలే పలుకునని ప్రభువు చెప్పెను. యోహాను. 16:14 ముగ్గురు ఒక్కటే అట్టి ఐక్యత సంఘములో నుండవలెను. అట్టి ఐక్యత ఉన్నందున కీర్తన. 133:1లో ఉన్నట్టు ఎంత మేలు, ఎంత మనోహరముగా ఉండును. మేలంటే ఉపకారము కలుగుట దానివల్ల సంతోషము కలుగును. సంఘమంతయు ఐక్యత కలిగి ఉన్న యెడల త్రిత్వములోని ఐక్యత అను ప్రతిబింబము సంఘములోనికి వచ్చును. అప్పుడు దేవుడు మనము ఒకటే అగుదుము. ఐక్యమత్యత ఉన్నందు వలన మిషనుల బేధము ఉండకూడదు. ఇతర మతముల బేధము ఉండకూడదు, ఏనాడో పుట్టిన ఆ బేధమును తీసివేయగలమా? ఫలాని వారు లూథరనులు, ఫలానివారు బాప్టిస్టులు అను బేధాభిప్రాయము ఉండకూడదు. ఎవరి మతము వారికే ఎవరి మిషనువారికే. ఎవరి స్వంత అభిప్రాయము వారికే గొప్ప. గనుక బేధాభిప్రాయము ఉండకూడదు. మనము భేదాభిప్రాయము తీసివేసికొన్న అందరు తీసివేసికొనగలరా? తీసివేసికొన్న అదే మనోహరముగా ఉండును.

"పరమదయానిధి క్రీస్తుబలమున - పాపభారంబులు విడునన్న - పరిశుద్ధాత్మని బంధుత్వంబున - అరమర చీకటులన్నియు తొలగును ॥మనసానందము॥

దైవసన్నిధికి వచ్చిన యెడల ఐక్యత కలుగును. దైవసన్నిధిలో పరిశుద్ధాత్ముడు అన్ని అరమరలు తొలగించును. దైవసన్నిధిలో ఐక్యత కలిగించుకొనవలెను. అప్పుడు ఐక్యత కలుగును.

**ప్రార్థన:-** ప్రతివారియొక్క జ్ఞానములోనూ, మనస్సాక్షిలోను, ఆత్మలోనూ ఈ విషయములు చొరవబడునట్లు కటాక్షింపుము. ఇదివరకు ఉన్నవారిని, క్రొత్తవారిని దీవించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఎవరైన నిన్న మీరు చదివిన దైవ నిశ్శబ్ద విషయములో ప్రశ్నలు ఉంటే బైబిలు మిషను పాస్టర్లను అడిగి తెలిసికొనండి చెప్పండి, పూర్తిగా వినండి పూర్తిగా వినకపోతే ఇది నిజమా? అను ప్రశ్నవచ్చును. సైతాను అవ్వకు మొదట వేసిన ప్రశ్న ఇదే. మీరు ఇక్కడ జవాబులనే ఆయుధములను సిద్ధపరచుకొనండి. లేకపోతే సాతాను సందేహమును ప్రవేశపెట్టును. అప్పుడు అంతా వ్యతిరేకమే వచ్చును ఎలాగంటే, దేవుడు శక్తిమంతుడని లక్షణములలో ఉంటే దేవుడు శక్తిహీనుడు. నీవు గొప్పపాపివి, నిన్ను రక్షించలేడు శక్తిహీనుడు అందరిని రక్షింపగలడా? నిన్ను రక్షించలేడు అని పుట్టించును. నీ జబ్బు తీసివేయలేడు నరకమునకు వెళ్ళినా ఊరుకొనును దేవుడు శక్తిమంతుడైతే ఒక్కరినైనా నరకమునకు వెళ్ళకుండ రక్షింపకూడదా? దేవుడు శక్తిమంతుడని ఎందుకనుచున్నావు? అని సాతాను అనేక ప్రశ్నలు పుట్టించును. నీవు పూర్తిగా తెలిసికొన్న యెడల దేవుడు శక్తిమంతుడని వాక్యములో నున్నది. నీ మాటలు నీకు నచ్చును గాని నాకు నచ్చవు దేవుని వాక్యమే నిజమని చెప్పగలవు. సైతాను అవ్వతో ఇది నిజమా? అన్నప్పుడు మా తండ్రి చెప్పునది చేయుదును. నీవు నచ్చచెప్పినా నేను చేయను అని అనవలసినది కాని అనలేదు. దేవుని లక్షణములకు, శక్తికి సైతాను అడ్డు, సైతాను పనులకు, శక్తికి, భక్తుల ప్రార్థనలు అడ్డు. ఇశ్రాయేలీయులు ఎర్ర సముద్రము దగ్గరకు వచ్చినప్పుడు ఈ ప్రక్క, ఆ ప్రక్క కొండలు, వెనుక శత్రువులు, వారు ఏమి చేయవలెను? అప్పుడు వారు దేవుని ప్రార్థించిరి. వెంటనే దేవుని శక్తివచ్చి ఎర్ర సముద్రమును పాయలు చేసినది. దేవుని వాక్యమునకు అపార్థము అడ్డు వచ్చినపుడు, ప్రార్థించి సాతాను చెప్పిన మాటను కొట్టివేయవలయును. శక్తినిబట్టి అన్ని గ్రహించుకొనండి. దైవలక్షణములకు వ్యతిరేకమైనవి సాతాను ఎన్ని ఆటంకములు కలిగించుచున్నాడో! అవి అన్ని చెప్పెను వాటిని నివారణ చేయుటకు భక్తుల ప్రార్థనలు ఎట్లున్నవో అన్ని చెప్పెను.

దేవుడు తన జ్ఞానశక్తినిబట్టి ఒక మాట అన్నాడు. పండుతింటే మరణమని అన్నాడు గనుక దేవుని మాట వలన ఆదాము రాబోవు సంగతియైన మరణమును తెలిసికొన్నాడు. దానికి వ్యతిరేకముగా ఇది

నిజమా? అని సైతాను పెట్టినాడు. నీకు మేలు కలుగునని దేవునికి తెలియునని మంచి మాట అన్నాడు. తన మాటవలన తబ్బిబ్బుచేసి తినవద్దు తింటే చావు అని దేవుడు చెప్పిన ఆ మాటలు మరచిపోయేటంతగా తబ్బిబ్బుచేసి, ఆ జ్ఞానమును సాతాను వారి బుర్రలో ప్రవేశపెట్టెను. దేవుడు జ్ఞాన ప్రకారము జరగలేదు, వారు ప్రార్ధించలేదు, వారికి ఇంత తర్ఫీదులేదు. గాన దేవుడే వచ్చివారిలోనున్న పాపమునుచెప్పి సైతాను కార్యమునకు అడ్డువచ్చెను. సైతాను కార్యములను ధ్వంసము చేయుటకు ప్రయత్నముచేసెను (1యోహా. 3:8) దేవుని లక్షణములను తప్పు అర్ధము చేసికొనేటట్టు చేసి ఆయన రక్షణ కార్యమును లయపర్చుటకు నేటివరకు సైతాను ప్రయత్నము చేయుచున్నాడు. దేవుని శక్తి, జ్ఞానము అను రెండు లక్షణములను వ్యతిరేకమైనవి చెప్పితిని. దేవుడు నిత్యము ఆది, అంతము లేనివాడు. అనాది, అనంతము, శాశ్వతమైనవాడు జీవమిచ్చువాడు. అయితే దైవభక్తుడు చనిపోయేటప్పుడు ఈ భక్తుడు దాటిపోవుచున్నాడని సైతాను ఆఖరి పర్యాయము వచ్చి ఇంకేమి బ్రతుకు? ఇంకేమి ప్రార్ధన? ఇంకేమి విశ్వాసము? ఇంకేమి దేవుడు? ఇంకా బ్రతకాలనేనా? చివరికి మరణము వచ్చినది చనిపోవుచున్నావు. డాక్టరు చెప్పనే చెప్పినాడు నేను ఇంకా బాగా చెప్పుచున్నాను. తరువాత ఇంకా ఏమౌదువు? మోక్షమునకు వెళ్ళుదునను చున్నావు అది నిజమా? కాదు. నిజము కాదంటే మాత్రము నీవు నమ్ముతావా? అని చెప్పుచున్నాను. నీవు జీవములో ప్రవేశించవు మరణములో ప్రవేశించవు అనిచెప్పును. స్థిరవిశ్వాసియైన భక్తుడైతే సైతాను చెప్పిన మాట వినడు. దేవునియొక్కయు, దేవుని వాక్యము యొక్క నిజార్ధము తెలిసినవాడైతే అన్నిటికి జవాబిచ్చి సైతాను కార్యములను లయముచేయును. ఇంత భక్తునికి మరణము వచ్చిన రావచ్చును గాని వెంటనే నిత్య జీవము వచ్చును. అది నీకు తెలియదు. అది నాకు తెలియును, అని దైవవాక్యమెరిగిన జ్ఞాని చెప్పి వ్యతిరేక భావమున జయించును. ఈ భక్తునికిని, సైతానుకును అట్టి సంభాషణ చాల దీర్ఘముగా ఉన్నది. నేను కొంచెమే చెప్పితిని. 'ఎవరైతే దర్శనవరము పొందుదురో వారు క్రొత్త జవాబులు చెప్పుదురు. ఓ అపవాదీ! నేను బాగా ఉన్నప్పుడు

మొన్న జబ్బుగా నున్నప్పుడు దైవసన్నిధిలో కనిపెట్టుచుండగా నా తండ్రి వచ్చి నా ఆత్మను మోక్షములోనికి తీసికొని వెళ్ళి ఇదిగో నీవు రానైయున్న మహిమ స్థలమని నాకు చెప్పియున్నారు. అలాటివన్ని నీకెక్కడ వినబడును? నీ ఆటలు సాగవు నాకు అన్నియు తెలియునని దర్శనవర పుత్రుడనును. సాతాను ఊరుకొనడు. వట్టి వట్టి ఊహలను పుట్టించును. అప్పుడు దైవభక్తుడిట్లనును:- నామాటవట్టి ఊహ అయితే మరి నీమాటో? ఇక వెళ్ళువెళ్ళు, నేను ఇట్లు మోక్షమునకు వెళ్ళుదును అనెను. దర్శనము గలవాడు బాగా చెప్పును. సాతాను ఓడిపోవును. అవిశ్వాసి అయితే ఓడిపోవును. విశ్వాసిదగ్గరసాతాను ఓడిపోయి వెక్కిరించును. ఎట్లనగా ఇద్దరు పిల్లలు పోట్లాడుచుండగా ఒకరు క్రిందపడెను. పడినవాడు పళ్ళు ఇకిలించి వెక్కిరించెను. అట్లే సాతాను చేయును. నేను చెప్పిన మాట వినలేదులే నరకానికి పోవుదువు అని చెప్పి మూలుగుచు వెళ్ళిపోవును. గనుక జాగ్రత్త మరణ సమయమందే కాదు. ప్రతి కష్టమసమయమందు, తోచని సమయమందు, ప్రతి సందే సమయమందు ప్రతి నిశ్శబ్ద కాలమందు అతగాడువచ్చి ఇట్టి మాటలే చెప్పిపోవును. అభ్యంతరపడకుండ ఉంటే ఒకమాట చెప్పుదును. సాతాను ఈవేళ ఉదయము వచ్చి నిన్ననే అంతా చెప్పివేసినావు మిగతా ఉన్న రెండు రోజులు ఏమి చెప్పుదువు? అని అయ్యగారిని అడిగెను. అయ్యగారు సాతానుకు ఈలాగు జవాబిచ్చిరి. నా తండ్రి అందించిన చెప్పుదును. అందించకపోయిన చెప్పను. నాకు వర్తమానము రాకపోతే నేనన్నమాటే నెరవేరినదని సాతాను అంటే సాతానా! అవసరమైతే అందిస్తారు లేకపోతే కుమారుడా చాలు అంటారు. ఆయనదేపద్దు నాపద్దు ఏది? అనవలెను. సాతానుయొక్క అపాయములు తప్పించుకొనుటకు ఈ ఉపాయములు ఉండవలెను. బైబిలు చదవకపోయిన, ధ్యానించకపోయిన ఈ ఉపాయములురావు. బైబిలుచదువుట, ధ్యానించుట, బైబిలు ఎక్కడ చదివితే అక్కడ దేవుడు నాతో మాటలాడుచున్నాడని అర్థమగును. ప్రభువు హృదయములో మాట్లాడును. మీకా అను ప్రవక్త కాలములో దేవుడు నిశ్శబ్దము నారంభించెను. ప్రభువు వచ్చువరకు సుమారు 40 సం॥లకు ముందు

1) కనబడెను 2) మాటలాడెను 3) వ్రాయించెను 4) చేయించెను. ఈ నాలుగు అయిన తరువాత ఇంక చెప్పవలసినవిలేవు. గాన 400 సంవత్సరములు నిశ్శబ్దముగానుండెను. ఎందుచేత! అందుచేత పై నాలుగు అయినవి గనుక దేవుడు ఊరుకొన్నాడు. ఇవి ఫలింపవలెను. వ్యవసాయదారుడు పొలములో శుభ్రము చేయును. దున్నించును ముఖ్యమైన పని అందులో విత్తనములువేయుట తరువాత పని ఏమిటి? నిశ్శబ్దముగా నుండును. తెలియనివాడైతే వడ్లగింజ మొలచినదో ప్రదినదినము తీసి చూచును. అది ఏమి ఎదుగును? దేవుడు తన క్రియలు ఏవి చేయక 400 సం॥లు నిశ్శబ్దముగా ఉండెను. అలాగే మనలో దేవుని వాక్యము అనే విత్తనము ఫలించేటప్పుడు దేవుడు ఊరుకొనును అదే నిశ్శబ్దము అదే ప్రేమ పంట విరగగాయును. పంట విరగ పండినది కోసేవరకు ఉండకుండ విరిగిపోతే దండుకొని పోవువారుందురు. దేవుడు చేసినపనికంటే నిశ్శబ్దకాలములో ఎక్కువ పని జరుగకమానదు. అదివరకు నీ హృదయములో దేవుడు చేసిన పనికంటే ఇప్పుడు ఆయన ప్రత్యక్షపరచుచున్న నిశ్శబ్దమువల్ల ఎక్కువమేలు కలుగును. ఎంతగొప్ప మేలంటే మీకా వద్దనుండి జకర్యా వరకు నిశ్శబ్దముగా ఉండి అక్కడనుండి రక్షకుడు వచ్చునని చెప్పుట అది నెరవేరుట, ఇది గొప్పపని దేవుని పనులన్నీ ఇట్లే ఉండును. తన ప్రియ కుమారుడు చంపబడిన కాలమున దేవుడు నిశ్శబ్దముగా నున్నాడు, సమాది చేసిన ఊరుకొన్నాడు. ఫలితము పునరుత్థానము. అలాగే క్రైస్తవ జీవితములో జరుగును. దేవుని నిశ్శబ్దమువల్ల కలిగే గౌరవము పూలదండలవంటిది, కాబట్టి సంతోషించండి. భయపడవద్దు ఓ ప్రభువా! ఇది నిశ్శబ్దము గనుక భక్తుడు నా ప్రార్థన వినుటలేదు. నా కష్టములు తీసివేయుటలేదు అని అనక భక్తుడుకూడా నిశ్శబ్దముగా నుంటే సాతానుకు భయము, ఈ అంశములోనిది కాకపోయినను ఇందులో వాడుకొనెదము. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ ఈ ముగ్గురిలో ఐక్యత ఉన్నది. అలాగే భూమిమీద అక్కడకూడా విశ్వాసులు అనేకులైననూ వారితో వారికి ఐక్యత ఉన్నది. ఆ ఐక్యతనుబట్టి ఈ ఐక్యత వచ్చినది.

ఐక్యత ఉన్నది గనుక త్రియేక దేవుని ఐక్యత సంఘములో ఉన్నది గనుక ఎంత చెప్పిన అంతే ఆయన ఏది చేసిన అదే.

ఆయన నిశ్శబ్దముగా నుంటే ఈ భక్తుడుకూడా నిశ్శబ్దముగా నుండును. ఒకప్పుడు నాకు ఒక గొప్ప కష్టము వచ్చినది. ప్రభువా! కష్ట నివారణ చేయుము. నీవు కష్టనివారణ చేయకపోతే నేను సహించలేనని ప్రార్థించితిని. పరిశుద్ధాత్మ మహా ప్రకాశముగా కనబడి "ఊహు" అన్నారు. అనగా నీ కష్టముతీసి వేయమంటే ఆయన ఎందుకు తీసివేయలేదు అనే ఆలోచన రాకుండ నేను దుప్పటి నిండ కప్పుకొని పండుకొంటిని ప్రభువా! నీవు కష్ట నివారణ చేయకపోవుటకు నీ ఏర్పాటు ఏదో ఉన్నది గాన రాగరాగ నీ ఏర్పాటుకే అడ్డురానా? అని ఊరుకొన్నాను. హబక్కూకు, హోషేయా గ్రంథములలో దేవుని నిశ్శబ్దము ఉన్నది ఎన్నాళ్లు వరకు ఊరుకొందునని హబక్కూకు అనెను (హబక్కూకు. 1:13).

ఇక్కడ ఒక గ్లాసు ఉన్నది. ఈ గ్లాసులోని నీళ్లు ఇక్కడ కూర్చున్న ఒక స్నేహితుడు త్రాగినాడు. ఇక్కడ వండించే ఆయన తలుపుచాటున ఉండి చూస్తున్నాడు, త్రాగగానే ఆ చూస్తున్న ఆయన మరలవచ్చి గ్లాసునిండ నీళ్లు పోసెను. ఇక్కడ ప్లేటులోనున్నవి ఒకాయన భోంచేస్తున్నాడు అన్నము తగ్గిన, కూర తగ్గిన మరలా తీసికొని వచ్చివేయును. అప్పుడు భోజనముచేయు ఆయన చాలు అనును, అప్పుడు వేయుట మానివేయును. మనము ఎంత అనుభవించగలమో ప్రభువు అంత ఇస్తారు గాని ఇంక అక్కడ ఎంతో మిగిలియుండును. ఇంక అడుగవలెనని చూచుచుండును అడిగితే ఇస్తారు. అడగకపోతే ఇవ్వరు. ఇది మంచి దృష్టాంతము ఇది మాత్రమేకాదు నేను చెప్పేది బైబిలులో ఒకవాక్యమున్నది. 1కొరింథి. 10:13 సహింపగలిగిన దానికంటే ఎక్కువ శోధనరానివ్వడు. ఒక మనిషికి కష్టమువస్తే అతడు ఎంతవరకు సహించగలడో చూచి ఇక సహించలేడనునప్పుడు ఆయన ఆపుచేయును. ఇంకా ఒక్కరవ్వంత కష్టమువస్తే మనిషి నశించునని ఆయనకు తెలిసి ఆపుచేయును. ఇది ఆయనకున్న దృష్టి ప్రకారము ఆయనకున్న లెక్కప్రకారము ఆపుచేయును. ఆ లెక్కమనకు చాలకపోవును. పరలోకము వేరు. ఆయన లెక్క వేరు.

ఆయన దృష్టివేరు, ఈ ఘటము ఎంత కష్టము సహిస్తుందో అను సంగతి ఈ ఘటమును కలుగజేసిన ఆయనకు తెలుసు, ఈ ఘటమునకు తెలియదు. అందుచే మొదటనే ఆపుచేయక కష్టమును ఇంక ముందునకు జరుగనిచ్చును. ఎక్కడ ఆపుచేయవలెనో అక్కడ ఆపుచేయును. కష్టము ఆరంభించినది. మొదలుకొని తండ్రి కష్టమును ఆపుచేయలేదు. ఇక ఆపుచేయును. కష్టము ఆరంభించినది మొదలుకొని తండ్రి కష్టమును ఆపుచేయలేదు ఇక ఆపుచేయును. ఎందుకంటే ఇక సహించలేదు. ఈ ఘటము లోపలనున్న ఆత్మ ఆ కష్టకాలములో తయారగుచున్నదో లేదో ప్రభువు చూస్తు కష్టమును సాగనిచ్చును. ఈ రెండు చూడవలెను. ఇక్కడ కష్టము వచ్చుచున్నది. అక్కడ ఆత్మసిద్ధమగుచున్నది. ఆత్మసిద్ధపడుట మనకు తెలియదు. శరీరమునకు, ప్రాణమునకు తెలియదు. ఈ రెండు ఒక జట్టు. ఆత్మకు తెలియును. ఆత్మ సిద్ధమగుచున్నకొలది ఆత్మ ఇంక సిద్ధము కావలసియున్నప్పుడు కష్టము ఎక్కువగుచుండును. ఇక్కడ సిద్ధమైతే కష్టమును ఆపుచేయును. ఈ రెండు చూడవలెను. ఆత్మసిద్ధమగుటయే దేవునికి ముఖ్యమైనది. కష్టము ఈ ఆత్మ బాగుచేయుటకు ఒక సాధనము. ఆత్మను బాగుచేయుటకు ఈ కష్టము ఒక పనిముట్టువంటిది. ప్రతి మనిషిలో ఈ రెండును జరుగుచున్నవి జన్మించిన ప్రతి మనిషిలోను ఈ రెండు జరుగచున్నవి. ఈ ఘటమునకు తెలియదుగాని, ఈ ఘటములోని ఆత్మకు తెలియును. ఆత్మ యోగి దైవధ్యానములో నుండును. ఈ యోగియొక్క తపస్సు పూర్తియై సిద్ధమయ్యేవరకు కష్టము తగ్గదు.

12. ఒక రోగికి మందు నీళ్ళు ట్యూబు ద్వారా ఎక్కించునప్పుడు గ్లాసులో నీళ్ళుచూస్తూ ఎక్కించును తుదకు ఆపుచేయును. డాక్టరు నీళ్ళు ఎక్కువ ఎక్కిస్తే మనిషి చనిపోవును గాన డాక్టరు నీటి ఒరవడి చూచి ఎంతవరకు ఎక్కించవలెనో అంతవరకు ఎక్కించి ఆపుచేయును. అట్లే పరమ తండ్రి చూచినది వేరే ఉన్నది. అది అయ్యేవరకు తండ్రి కష్టములు ఆపుచేయడు.

1. గ్లాసులో త్రాగేనీళ్ళు, అన్నము, 2. శరీరము, ఆత్మ, 3. ఆసుపత్రి, ఉపకరణము ఈ మూడు దృష్టాంతములు ఇవి దేవుని

నిశ్శబ్దమును వివరించుచున్నవి. ఓ పంతులమ్మలారా! పంతుళ్లారా! గవర్నమెంటు వారు ఒకరూలు ఏర్పాటు చేసిరి. ఆ రూలు లేకముందు పిల్లలు తప్పుచేస్తే ఎక్కడబడితే అక్కడ పంతులుగారు కొట్టేవారు. ఇప్పుడు మూడు దెబ్బలకంటే ఎక్కువ కొట్టకూడదు. ఆ దెబ్బలు కొట్టిన మాస్టరు ఉద్యోగము పోవును. బుద్ధివచ్చేవరకు ఆ పిల్లవానిని కొట్టకపోతే ఏమి లాభమని మాస్టరుగారు అంటే బుద్ధి వచ్చేవరకు శిక్షిస్తే పిల్లవాడు సహించలేడు గాన సహించగలిగినంతమట్టుకే శిక్షించవలెనని గవర్నమెంటు వారనుచున్నారు. మీరు సహింపగలిగినంతకంటే ఎక్కువ ఆయన మిమ్మును శోధింపబడనీయడు. 1కొరింథి. 10:13 ఇది పరలోక గవర్నమెంటు రూలు.

2. ఒకరు రహస్యమైన గదిలో ప్రార్ధనచేయకుండ ఉండెను. అతడు చేతులు నలుపుచూ ప్రభువా! నన్ను నీ సింహాసనమువద్ద మొదటి స్థానమందు ఉంచుము అని అడుగుచుండగా అయ్యగారు వెళ్ళిరి. అట్టి స్థానము కావలెననిన అధికమైన కష్టములు రానిచ్చును. అధికమైన కష్టములు రానియెడల అధికమైన స్థానమురాదు. అప్పుడు ఈ సామి మూలుగును అప్పుడు ప్రభువుపై స్థానము కావలెనని నీవెకదా కోరినావు? పై స్థానము కావలెనంటే ఇచ్చెదను గానీ ఈ అధికమైన కష్టములు లేకుండ ఈ ఘనమైన స్థానము దొరకదనెను. ఈ సంవత్సరము మా పొలములో 10 బస్తాల ధాన్యము పండినది. ఇవి చాలవు వచ్చే సంవత్సరము 20 బస్తాలు కావలెననెను. ఈ భూస్వామికి ఎక్కువ కష్టమా? తక్కువ కష్టమా? నేను ఎక్కువ కష్టపడుచున్నానని మూలిగిన ఆ 10 బస్తాలు రావుకదా! నీవు కోరుకొన్నట్లు నెరవేరపోవలెనంటే కష్టములు తప్పవు.

23. ఒక భక్తుడు ఇట్లనుచున్నాడు ప్రభువా! నాకు పై స్థానము వద్దు ఎక్కడయినా ఒక మూల ఉంచితే అక్కడ ఉండి నీ ముఖము చూచుచుందును. అది మోక్షమేకదా అనెను. ఎక్కువ స్థానము కోరుకొన్న ఎక్కువ కష్టములుగాన నేను సహించలేనని ప్రార్ధనచేసెను. మీలో మోక్షములో ఒక మూల కావలెనని కోరుకొనువారున్నారా? మోక్షములో 7 అంతస్థులున్నవి ఎఫెసు నుండి లవొదికయ వరకు. ఈ 7

సంఘాంతస్థులు ఈ ఏడు సింహాసనము దగ్గరనే ఉన్నవి. గాని లవొదికయ దేవుని సింహాసనమునకు మిక్కిలి సమీపముగా ఉన్నది. దీనిని కోరుకొనుచున్నారు గాని కష్టములు వచ్చిన విసుగుకొందురు. నత్తవలె పడిపోవుచున్నారు. రెండు గజములు ఎక్కి 3 గజములు పడిపోవుచున్నారు. కొందరు గొప్ప స్థితిలోనికి వచ్చి తగ్గిపోవుచున్నారు. అట్టివారు ఉన్నారు మీకు ఏది కావలెనో కోరుకొనండి అంతామోక్షమే అంతా మహిమేగాని అనుభవము తేడాగానుండును. మొదటి అనుభవముకంటే తక్కిన అంతస్థుగలవారి అనుభవాంతస్థు వేరుగా నుండును. ప్రకటన. 2,3 అధ్యాయము ఈ 7 అంతస్థులుకాక ఇంకొక క్రొత్త అంతస్థు ప్రకటనలో ఉన్నది. ఆ ఏడేండ్ల శ్రమకాలములో రక్షింపబడినవారున్న అంతస్థు రక్షితుల మోక్షము కలదు. ఇది ఎనిమిదవ అంతస్థు. ఇదియుగాక ఇంకొక క్రొత్త అంతస్తు ప్రకటనలో ఉన్నది. అది ఎప్పుడు చెప్పలేదు. చెప్పినాను గానీ నంబరు వేయలేదు. అది ఏమనగా వెయ్యి సంవత్సరముల పాలన జరిగిపోయిన తర్వాత చివర అంత్యతీర్పు అయిన తరువాత, ఈ భూలోకముకూడా మోక్ష లోములో ఒక భాగమగును. ఈ భూలోకము మొదట కలుగజేసిన భూలోకమువంటితగును. ఏ బేధములేదు. పాపములేదు. ఆదాము, హవ్వలకు పాపమంటే ఏమిటో తెలియనట్లు వీరికికూడా పాపమంటే ఏమిటో తెలియదు. గనుక మోక్షములో ఒక భాగమగును. ఇది తొమ్మిదవ అంతస్థు. తొమ్మిది అంతస్థులలోను క్రీస్తుప్రభువు ఉండును. ఈ అంతస్థులలో ఉన్న కోటాను కోట్లు ప్రజలవద్ద వారి వారి అంతస్థునుబట్టి ఒక్కొక్కరితోను ప్రభువు ఉండును. వారివారి అంతస్థు స్థితిని బట్టి ప్రభువుయొక్క మహిమ వారికి కనబడును 1కొరింథి. 15. వారెంత మహిమ సంపాదించుకొన్నారో అంత మహిమతో ప్రభువు వారివద్ద ఉండును. ఎఫెసు సంఘములోని మహిమ వేరు, మిగత సంఘముల అంతస్థులవారి మహిమ వేరు 1కొరింథి. 15:38-41.

ఈ నక్షత్రమహిమ వేరు ఆ నక్షత్ర మహిమ వేరు. (క్రొత్త శరీరము) మాంసము అంత ఒకటికాదు వేరువేరు. ఆకాశ వస్తు రూపములు వేరు, భూవస్తురూపములువేరు. సూర్యుని మహిమ వేరు. చంద్రుని

మహిమవేరు, నక్షత్ర మహిమ వేరు. ఇక్కడ ఎంత మహిమ సంపాదించుకొనిన అక్కడ అంత మహిమ ఉండును. ప్రతివారు తమతమ వరుసలో ఉందురు. పరమందు బేధములేదుగానీ బేధము కనబడుచున్నది. ఈ లోక బేధమువంటి తగాదా బేధము అక్కడలేదు. ప్రభువా! నన్ను ఇక్కడ కూర్చుండబెట్టినావు? ఇంటిలో పనిచేసిన మనిషిని ఎందుకు అక్కడ కూర్చుండబెట్టినావు అని అనరు. ఇక్కడ ఈ బేధము ఉన్నది. గనుక ఆ మాట అందురుగానీ పరమందు అనరు. యోసేపు సహోదరులు తమ్మునిమీద అసూయపడి కలలుకనువాడు వచ్చుచున్నాడని పట్టుకొని గోతిలో పడవేసి విచారము లేకుండ అన్నము తినుచుండిరి. ఈ కథ ఇక్కడ మారినది. యోసేపు విందుచేసినప్పుడు పదిమందికి ఒక్కొక్క వంతుచొప్పున వడ్డింపజేసి బెన్యామీనుకు 5 అంతలు వడ్డించినట్లుగా చేసియున్నాడు.

అప్పుడు అన్నలు అసూయపడలేదుగానీ సంతోషించిరి. అట్లే పరలోకములో అంతస్థుల బేధమునుబట్టి అసూయపడరు. గాని సంతోషింతురు. అంతగొప్ప స్థితి అక్కడ వచ్చును. పై అంతస్థులో ఏదో ఒకటి కోరుకొనండి. బల్లమీద ఉన్నవన్ని తినేవే గనుక మీకు ఇష్టము ఉన్నవి తీసికొని తినండి. ఏదైనా అక్కరలేదనిన అక్కడనుండి తీసివేయును. పై అంతస్థునకు సరిపడునట్టి కష్టములయొక్క అంతస్థు ఏదో ఆయనకు తెలియును గనుక ఆయా కష్టములు వచ్చినప్పుడు ఆయన ఊరుకొనును.

24. ఒక స్నేహితుడు ఒకనికి అన్నము వడ్డించుచుండగా ఎక్కువ వడ్డించవద్దు తినలేదు పడవేయకూడదు. ఇది కష్టకాలము గనుక ఎక్కువ వడ్డించవద్దనెను. వద్దన్నను రెండు గరిటెల అన్నము వేసెను. అన్నమంత అతడు తినివేసెను. భుజించే స్నేహితుడు వద్దన్నను వడ్డించిన దంతయు తినెను. వడ్డించువారికి తెలిసి వడ్డించెను. అట్లే విశ్వాసి వద్దన్నను తీరా ప్రభువు తీసికొని వెళ్ళిన నాకు అక్కరలేదనడు. గాని ఆనందించును ఈ మహిమకు తగిన కష్టము ఇచ్చినప్పుడు ఈ శ్రమ వద్దు తీసివేయుము ప్రభువా! అన్నావు. తీసివేసిన ఇట్టి మహిమ దొరుకునా? అని ప్రభువు పలుకును. కొందరి విషయములో ప్రభువు ఇట్లు అనును. ఇక్కడ శ్రమవద్దు

Bible Mission HQ Guntur

అనే విశ్వాసి పరలోకమునకు వెళ్ళినది. దీనికి బైబిలులో ఒక కథ ఉన్నది గాని అది సరిపోదుగాని సరిపోయేటట్టు నేను పొదుపుగా వాడుకొందును. మత్తయి 25 అధ్యాయము. అవును ప్రభువా! నీవు ఎప్పుడు జబ్బుగానున్నావు? నేను ఎప్పుడు చూడవచ్చితిని. నీవు ఎప్పుడు ఆకలిగొన్నావు? ఎప్పుడు అన్నము పెట్టితిని? అని విశ్వాసి అనును. ఈ కథను ఇది సరిపోవును ఇంతగొప్ప అంతస్థు ఎందుకిచ్చినావంటే దీనికి తగిన రీతిని భూమిపై నడచినావు గాన ఇంతగొప్ప అంతస్థును ఇచ్చితిని అనును.

**ప్రశ్న:-** దొంగ ప్రభువు కొరకు ఏమి శ్రమపడెను. అయినను రక్షణ వచ్చినది. దొంగను నిలువున సిలువవేసిరి దొంగయొక్క పాపమునకు శిక్ష సిలువ మరణము. ప్రభువును మెచ్చుకొన్నందున రక్షణ వచ్చినది. 1) ప్రభువును తెలిసికొనలేదు 2) వాక్యమును పఠించలేదు 3) నమ్మలేదు 4) అంగీకరించలేదు 5) ప్రకటించలేదు 6) కష్టములు అనుభవించను లేదు 7) గొప్ప అంతస్థును కోరుకొనలేదు గనుకనే ప్రభువు పరదైసులో ఉందువలెను. లూకా 23. దొంగ మరణ సమయమప్పుడు మారినందున ఎక్కువ అంతస్థును సంపాదించుకొనుటకు వీలులేకపోయినది.

ప్రకటనలో 2వ అధ్యాయములో ఉన్న మొదటి అంతస్థయిన పరదైసు అంతస్థు మాత్రమే వచ్చినది. పరదైసులో ఉన్నవారు మొదటి అంతస్థు. ఇక్కడ ఎన్ని విన్న, ఎన్ని చదివిన, ఎన్ని వ్రాసికొన్న జ్ఞానము, మనస్సాక్షి, ఆత్మ చెప్పినను నచ్చనివారుందురు. అట్టివారు మరణ సమయములో మారి పరదైసుకు వెళ్ళుదురు. ముందే మారితే గొప్ప అంతస్థు ఉండును వారు మారలేదు గనుక గొప్ప అంతస్థుకు చేరలేదు. ఈవేళ సంపాదించుకొంటే ఎక్కువ మహిమ దొరుకును రేపు అయితే పరదైసు అంతస్తే దొరుకును.

**ప్రార్థన:-** త్రియేక దేవుడవైన తండ్రీ! ఆకాశములోని జ్యోతులను, భూమిని, మేము అడుగకుండగానే ప్రతిదినము ఎట్లు చూపించుచున్నావో అలాగే మోక్షములోని సమస్తము నీవాక్యముద్వారా చూపించుచున్నావు

గనుక నీకు స్తోత్రములు. మోక్షములోనున్న సంగతులు మాకు పటము ద్వారా చూపినట్టు అక్కడ ఎవరున్నారో ఏమి మాట్లాడుచున్నారో అక్కడ దీపములేమిటో నీ గ్రంథములో వ్రాసిపెట్టి అన్ని మాకు చూపించుచున్న తండ్రీ నీకు స్తోత్రములు. జ్ఞాన నేత్రమునకు తెలియచేసిన తండ్రీ! స్తోత్రములు. మోక్షలోక పటము మాత్రమేగాక మేము అక్కడికి ఎట్లు సిద్ధపడవలెనో చూపించుచున్న నీకు వందనములు. ఇక్కడున్న అందరు వాక్యాహారము మిగిలేటట్టు వడ్డించుమని యేసునామమున వేడుకొనుచున్నాము ఆమేన్.

**మృతుల యెడల ప్రభువు ప్రేమ పని:-**

దేవుడు మనకొరకు మూడు పటములు (Maps) వేసి ఉంచినాడు.

1. ఈ భూలోకమంత ఒక పటము. భూగోళపటము కాదు, మనిషి పరలోకమునకు ఎట్లు సిద్ధపడవలెనో ఆస్థితిని చూపుపటము. ఆదినుండి లోకాంతము వరకు ఏలాగు జరిగించవలెనో ఆయన తలంచిన కథ యావత్తు ఒక పటము. ఇది బైబిలు గ్రంథమునందు వ్రాయించి ఉంచెను. అది తెలిసికొనుటకు మానవుని జ్ఞాననేత్రము విప్పెను.

**2వ పటము:-** మనము ఆకాశమువైపు చూచినా చూడకపోయినా దానంతట అదే మనకు కనబడేపటము అదే సూర్య, చంద్ర, నక్షత్రములు, మేఘములు మొదలైనవి గల ఆకాశపటము.

**3వ పటము:-** మోక్షలోకములో ఎవరున్నారో, ఏయే తరగతులున్నవో, ఏమహిమ ఉన్నదో ఇక్కడ మనుష్యులు ఏలాగు సిద్ధపడవలెనో అక్కడ ఏమి సిద్ధపరచుచున్నావో అదంత మోక్షలోక పటము. ఈ మూడు పటములను బట్టి మన హృదయమను పటము తయారగుచున్నది. అయితే ఈ పటము అంతా నల్లగీతలైనా తెల్లగీతలైనా ఉండును. కోడి పొదిగినప్పుడు గ్రుడ్లనుండి బయటకు వచ్చిన పిల్లలు కొన్ని నల్లగాను, కొన్ని ఎర్రగాను, కొన్నితెల్లగాను ఉండును. అట్లే మనుష్య హృదయములు ఆత్మలు రకరకములుగా తయారగుచున్నవి. కొన్ని గ్రుడ్లు చితికిపోవును కొన్ని పగిలిపోవును. అలాగే అనేకమంది మనుష్యులు

హృదయశుద్ధిగలవారై యుండరు, కొందరు పూర్తిగా చెడిపోదురు. మొదటి పటము చూపినా మారరు. రెండవ పటము దానంతట అది కనబడినా మారరు. మూడవ పటము భక్తులు వివరించినను మారరు. ఎట్లనగా చితికిపోయిన గ్రుడ్లవలె కొందరు మారరు. ఇటువంటి దృష్టాంతములు మనకు ఉన్నవి గాన మనము ఇప్పుడే మార్చుకొనవలసియున్నది. దేవుడు మంచివారిమీదను, చెడ్డవారిమీదను వర్షమును కురిపించి సూర్యకాంతిని ఉదయింపజేయుచున్నాడుగాని చెడిపోయినవారు ఏలాగైనా చెడిపోయినారు.

ఎట్లనగా ఒక మీటింగు జరుగుచున్నది.

(ఎ) మీటింగునకు వినేటందుకు వచ్చినవారుందురు.

(బి) మీటింగునకు వెళ్ళుట ఇష్టములేదు కానీ వేగు చూచుటకు వచ్చియుందురు

(సి) అదివరకు తెలిసివారు వస్తారు

(డి) భత్తిగా తెలియనివారు వస్తారు. మీటింగు అయిన తరువాత బయటికి వచ్చి ఈ నాలుగు గుంపులలో కొందరు అవి మంచి సంగతులే గాని ఎవరు నడువగలరు? అని అందురు. మరికొందరు ఇవన్ని ఎవరు చూచినారందురు. ఈ రెండు రకములైన గ్రుడ్ల చితికిపోయినట్లే.

ఈ పటములు ఈ ప్రకారముగా నుండగ, నేను చెప్పిన దేవుని లక్షణములకు వ్యతిరేకమైన లక్షణముల పటమును, సైతాను ఏ రీతిని పుటించునో ఆ ప్రకారమైన పటమును కొంతమంది యొక్క హృదయములలో వేయును. బహు చక్కగా వేయును. బోధవల్ల మారిన వారి హృదయములలో ప్రభువు సింహాసనము వేసికొనును. మారనివారి హృదయములలో సైతానుండును. అది తెలుపు. ఇది నలుపు అక్కడ శాంతి, ఇక్కడ గందర గోళములు ఉండును. కొంతవరకు ఇక్కడ పూర్తిగా మోక్షలోకములోని స్వరూపము ఏర్పడి ఈ భక్తులు క్రీస్తువంటి వారవుదురు. మారనివారు దయ్యములగుదురు.

అయితే క్రీస్తుప్రభుని ఎరుగని వారి సంగతి ఏమి? అట్టవారిని రక్షించుటకు యేసుప్రభువు కనిపెట్టుచున్నాడు. ఈ ప్రశ్నకు నేను చెప్పబోయే

Bible Mission HQ Guntur

ఈ బోధవిన్న క్రైస్తవులలో చాలమంది నాకు విరోధులగుదురు. వీరుకాక నాకు వేరే మంద ఉన్నది అని ప్రభువు చెప్పినారు. నా దొడ్డికి వాటిని తోలుకొని రావలెననెను. రక్షణ పొందిన మందనుగూర్చి ప్రభువు చెప్పుచు సంతోషించుచు వారిని తోలుకొని రావలెననెను. ప్రభువును ఎరుగని యూదులుకాని ఇతరులు, ప్రభువు ఎరుగకుండ చనిపోయినవారు మాత్రము ప్రభువు గొర్రెలుకారా? అట్టివారిని మాత్రము తోలుకొని రావద్దా? ప్రభువా! నిన్ను ఎరుగని వారిని నీ మందలోనికి తీసికొని వచ్చినా, రాకున్న, నిన్ను ఎరుగక చనిపోయిన వారిగతిఏమి? నీవు రాకముందు ఉన్నవారి కథ ఏమి? వేరే గొర్రెలైన అన్యులను ఈ దొడ్డిలోనికి తోలుకొని వచ్చిన న్యాయముకాదా? చనిపోయినవారైన గొర్రెలను తోలుకొని వచ్చుట న్యాయముకాదా? అని అడిగిన వారి సంగతి నాకెందుకు? భూలోక మందనుగూర్చి నేను చెప్పితిని. గాని వారిని గూర్చి ఎందుకు అని ప్రభువనరు. ఎందుకంటే వారును ఆయన కలుగజేసినవారే గనుక అనరు.

బ్రతికి ఉన్నవారిలో 1) ప్రభువును ఎరిగినవారు 2) ఎరుగనివారు 3) ఎరుగకుండ చనిపోయినవారు.

ఈ మూడు మందలలో వారిని కలుగజేసిన ఆయనే రక్షించకపోయిన యెడల ఇంకెవరు రక్షించేది? ఆయనే రక్షించవలెను. ఆయన సర్వవ్యాపియైయున్నాడు. అంతట ఉన్నాడు. రెండు మందలయొద్ద ఉండి మూడవ మందయొద్ద లేకున్న ఆయన సర్వవ్యాప్తికాడు. గనుక అక్కడకూడా ఉండవలెను. ఆయన సర్వజన రక్షకుడైయున్నాడు. సర్వజన రక్షకుడైన ఆయన అన్ని మందలను రక్షించుటకు ఏదో ఒక ఆలోచన చేయవలెను. అది బైబిలులో నుండవలెను. మీ స్నేహితులలో, మీ బంధువులలో మీ బిడ్డలలో ఎవరైనా ప్రభువును ఎరుగక, లేక దిక్కరించి చనిపోయిన వారి రక్షణను గురించి మీకు విచారముండదా? చనిపోయినందుకు విచారముండుట సరే! రక్షింపబడిన మీకు రక్షింప బడని వారిని గురించిన దిగులు మీకు ఉండదా? మట్టి మనుష్యులమైన మనకే విచారముంటే ప్రేమాస్వరూపియైన దేవునికి విచారముండదా? తప్పక ఉండును?

దేవునిని ఒప్పుకొననివారు ఎక్కడబడితే అక్కడే ఉన్నారు. వారిగతి ఏమవునో గాని నీ గతి ఏమవునో చెప్పుము. చెట్టు మొలచినది. నీడ నిచ్చినది. ఆ చెట్టుగు పురుగుపట్టి చెట్టు చచ్చినది, ఎండ వచ్చినందున యోనా దిగులుపడి విసిగుకొనెను.

అందుకు యెహోవా ఈవేళ పుట్టి ఈ వేళ ఎండిపోయిన ఈ చెట్టును గూర్చి నీకు విచారమైతే అంతమందితో నశించిపోయే నినెవే పట్టణపు వానిగూర్చి నాకు దిగులు ఉండదా? అనెను. యోనా. 4:11. నాశనమయ్యే వారినిగూర్చి ఆయనకు విచారముండును. ఒక్కరైన నశించుట నాకిష్టములేదని చెప్పిన ప్రభువు వారి రక్షణను గురించి ఏదైనా ఏర్పాటు చేయకుండునా? యోనా ఈ కబురు చెప్పుటకు వచ్చెను. తీరా బోధించిన తరువాత ప్రభువు తట్టు తిరిగెను. అందుచేత దేవుడు ప్రోగ్రామును మార్చెను. నాశనము తీసివేసెను. నీవు నేను నాశనము చేయుదును అని రక్షిస్తున్నావు అందుకేకదా నేను వెళ్ళనని అన్నాను అనెను. అందుకు దేవుడు ఇందుకు నీవు విచారిస్తే ఇంతమంది నాశనమయ్యే వారినిగూర్చి నాకు విచారముండదా! అనగా యోనా చివరకు సిగ్గుపడి ఊరుకొనెను.

అంధకారములోపడియున్నవారియొద్దకు ప్రభువు వెళ్ళెను– లోకమునకు రావడము, శిష్యులను భూదిగంతములవరకు పంపుట, ఏ విధముగా నున్నదో ఆ విధముగానే అక్కడకూడా ఉన్నది. ఆయన వెళ్ళవలెను. ఆయన శిష్యులుకూడా వెళ్ళవలెను, బోధించవలెను. భూమిమీద జరిగినట్లు అక్కడను జరుగును. భూమిమీద బోధించినపుడు విని కొందరు రక్షింపబడినారు. అలాగే అక్కడ కొందరు విందురు. కొందరు వినరు. ఇక్కడ నాటకేమే అక్కడను జరుగును. ఇక్కడ అక్కడ వినకపోతే ఏమి జరుగును? వినకపోతే కీడే, అట్టివారిని గూర్చి మనము ప్రార్థించవలెను. అట్టివారిని గూర్చి ప్రార్థింపవచ్చునా? అట్టివారి యొద్దకు ప్రభువు, శిష్యులు వెళ్ళి బోధించుచున్నారు గాన అట్టివారిని గూర్చి ప్రార్థింప వలెను. ఇక్కడనున్న వారికొరకు ఇక్కడనున్న వారు ప్రార్థించి, బోధించుట అక్కడనున్న వారికొరకు ప్రభువు శిష్యులు బోధించుట, ప్రార్థించుట అనే

కార్యక్రమము దేవుని చేతిలో ఉన్నది. గనుక పాతాళమునకు ఎవరినైన పంపి బోధ చేయింపవచ్చును. ప్రార్థన చేయింపవచ్చును అనునవి ఆయన కార్యక్రమములో ఉన్నవి.

యుద్ధములో అనేకమంది చనిపోవుచున్నారు. ప్రభువు ఊరుకొంటున్నారు. వారికి వారికి కలిగిన ద్వేషమునుబట్టి చంపుకొనుచుండగా ఊరుకొనుచుండెను. ఎందుకంటే చనిపోయన తరువాత వారియొద్దకు వెళ్ళి వారికి బోధిస్తానని ఊరుకొనెను. చావడానికి వెళ్ళినారు గనుక స్వహత్యవల్ల, బండిక్రింద, కారుక్రింద పడి నదిలో, నూతిలో పడి, విషయము త్రాగి అనేకమంది చనిపోవుచున్నారు. అందుకే ఊరుకొంటున్నారు. ఇక్కడ నా మాట విన్నారుకాదు. అక్కడైన చెప్పవచ్చునని ఆయన ఊరుకొనెను.

తండ్రి గడ్డము పట్టుకొని తప్పిపోయిన కుమారుని అన్నను బ్రతిమాలినను నేనురాను అన్నాడు. తండ్రి కబురు పంపిన రాలేదు. తండ్రి వెళ్ళినాడు అలాగే చనిపోయిన వారియొద్దకు వెళ్ళినాడు? కాని వెళ్ళకూడదు. అయితే ఈ తండ్రి పెద్దకుమారుని బ్రతిమాలినట్లు వారిని బ్రతిమాలుటకు వెళ్లెను. శిక్షించుటకు కాదు.

ప్రభుని చరిత్రయే సువార్త అక్కడ చెప్పేది అదే మీ కొరకు పుట్టితిని, బోధించితిని, చనిపోతిని అన్ని మీ కొరకే చేసితిని రండి అని అంటే అనేకమంది మోక్షమునకు వెళ్ళుదురు. ఇక్కడ విన్నవారు ఇక్కడినుండి వెళ్ళినట్లు అక్కడివారు విని నమ్మి వెళ్ళుదురు. ఇక్కడి వారు వెళ్ళినట్లు వారు వెళ్ళరు. 1సమూ. 2:6 పాతాళమునకు పంపుచు అందులోనుండి రప్పించుచుండువాడు ఆయనే పంపుటెందుకు వారు రాలేరు గనుక వారిని పాతాళమునకు పంపును. వారు అక్కడ నమ్మి వచ్చిన అక్కడినుండి రప్పించును కీర్తన. 139:7,8. దేవుడు అంతట ఉండును. పాతాళములోను ఉండును. ప్రభువు ఎక్కడనున్నవారినైన పట్టుకొనగలడు. దొరికితే ప్రభువు పట్టుకొనుటకు ప్రయత్నించును. దొరికితే పట్టుకొనును. మనిషి స్వతంత్రుడుగాన దొరికితే పట్టుకొనును. దొరుకకపోయిన ఊరుకొనును.

ఎవరి విషయములలోను దేవుడు అన్యాయము చేయడు. ఫిలిప్పీ. 2:9-11 పాతాళములో క్రీస్తును ఒప్పుకొందురు. దేవుడు ఎందుకు ఊరుకొంటున్నాడంటే పాతాళములోనైనా ప్రభువు వారిని పట్టుకొనును గనుక ఊరుకొంటున్నాడు.

ఈ భూమిమీద సువార్తను అందించేటప్పుడు మనుష్యులు వినివిననట్లు నిశ్శబ్దముగా ఉంటున్నారు. ఈ నిశ్శబ్దమును ఖండించుటకు దేవుని నిశ్శబ్దము ఉండును. సువార్త ప్రకటించే వారికి ఎంతో బాధగా ఉంటున్నది. ఇతరులు వేసే ప్రశ్నలు వేస్తున్నారు. ఆ ప్రశ్నలు ఈ బోధ అంతటిని బోధకుని కొట్టివేయుచున్నవి. చనిపోయినవారికి సువార్త ఉన్నదని చెప్పవద్దు. హేడెస్సులో విని మారవచ్చు అని ఇక్కడ వినరు. గాన చెప్పవద్దు అనుచున్నారు. మా ఇష్టానుసారముగా ఇక్కడ ఉండి అక్కడ నమ్మెదునందురు గాన చెప్పవద్దు అంటున్నారు. ఇక్కడ శరీరము ఉన్నది దీనితోపాటు పాపము ఇక్కడ ఉండిపోతున్నది. ఈ శరీరము అనవచ్చును. అక్కడ అది సాగదు. మారుమనస్సు పొందుటకు చాలా సంవత్సరములు పట్టును. ఇక్కడున్న సమయములో ఇక్కడగల శిక్ష, శ్రమ, కష్టములను బట్టి ఇక్కడ మారుట సుళువు 1పేతురు. 3:19-20.

**ఆత్మరూపము:-** ఆత్మల యొద్దకు వెళ్ళుటకు ఆత్మరూపముగా వెళ్ళెను. జలప్రళయములో నాశనమగుచుంటే ఎందుకు ఊరుకున్నాడంటే ఆత్మరూపిగా వెళ్ళి చెప్పవచ్చుననుకొని ఊరకుండెను. ఈ బోధ చేసే వారమైన మేము చేయుమనవి ఏమనగా ప్రభువును అడగండి. ఈ వ్రాత వ్రాయించిన ఆయనను అడిగితే నిరుకు తెలియగలదు. ఒకవేళ మాది తప్పు అయిన యెడల మాది తప్పు అని చెప్పును మీది తప్పు అయిన మీది తప్పు అని ప్రభువు చెప్పును.

ఒక షావుకారు ఒకనికి ఎకరము పొలము ఇచ్చెదనని అనెను. విన్న అతడు నాకు షావుకారు ఒక ఎకరము పొలము ఇచ్చినాడని అందరకు చెప్పుచుండెను. వ్రాతలేనిదే ఎందుకు చెప్పుచున్నావని అందరు అనగా ఆ ఎకరము పొలము వ్రాయించుకొనెను. క్షత్రియుడు వ్రాసి ఇచ్చెను.

బ్రతికియుండగనే వ్రాయించుకొని, ఆయన సంతకము పెట్టించుకొని, వేలిముద్ర వేయించుకొని, సాక్షుల సంతకము పెట్టించుకొని, పెట్టెలో పెట్టుకొనెను, ఇచ్చిన క్షత్రియుడు చనిపోయెను. వ్రాయించినది నమ్మకపోతే చచ్చినవాడు మరల రావలెనా? న్యాయము చొప్పున రాలేదు. బైబిలులో వ్రాత నమ్మకపోతే మనమాట నమ్ముదురా? గనుక వ్రాసిన ఆయనవస్తే వస్తాడు ప్రార్థించిన వచ్చును. ఎందుకు వస్తాడు ఇది నీవు వ్రాయించినదేనా! అంటే నేను వ్రాయించినదే అనును.

క్రీస్తు వచ్చెనని యున్నది 1పేతురు. 4:6. ఈ చనిపోయిన ఆయన వచ్చెనుగాని చనిపోయిన క్షత్రియుడురాలేదు. ప్రభువు వచ్చును. సరదాకైనా అడగండి సందేహము లేకపోయిన వచ్చిచెప్పును. ఇద్దరు ముగ్గురు ఉన్నచోటికి వస్తానన్నాడు గాన నీకు అడుగుటకు భయమైతే ఇంకొకరిని తీసికొనివెళ్ళి అడుగు. హిందూ మతములో నుండి మహమ్మదీయ మతములోనుండి, బౌద్ధ మతములోనుండి క్రీస్తును తీసికొని రాగలను. వారిలో కొందరు భక్తులున్నారు. వారిని ధూషింపవద్దు. వేరే గొర్రెలున్నవన్నది ఇదే గాన ఇతర మతముల వారిలో నున్నారు. వారియొద్దకు వెళ్ళి మనము నచ్చినట్లు చెప్పిన వారు దొడ్డిలోనికి వస్తారు. రెండవ దుర్భోధ ప్రభువు కనబడి మాట్లాడినారు నాతో మాటలాడినారు ఎన్నో మర్మములు తెలిపినారు. అవి అన్ని చెప్పలేను. మీరు అడిగి తెలిసికొనండి.

**ప్రార్థన:-** పిలిచిన ప్రభువా! మాతో ఉన్న ప్రభువా! మాకు బయలు పడిన ప్రభువా! క్రొత్త విషయములు బయలుపరచిన ప్రభువా! వందనములు. నాకు బయలుపరచినట్లు వారికిని బయలుపరచుము. ఇక్కడ ఉన్నవి వారికొరకు మీరు ప్రకటించే వారికొరకు ఈ వర్తమానములను దీవించుము. మరియొకసారి సమావేశ మై క్రొత్త సంగతులు నేర్చుకొను కృప దయచేయుము. మా స్వజనులను, సంఘములను దీవించుము. త్వరగా వచ్చుచున్న యేసునామమున వేడుకొనుచున్నాము ఆమేన్.

# దేవుడు ఎందుకు ఊరుకొనుచున్నాడు


గ్రంథకర్త

యం. దేవదాసు అయ్యగారు



గుంటూరు - 2026.  చందా : రూ/-7:00


Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1963 | ప్రతులు | 1000 |
| రెండవ | ” | 1986 | ” | 1000 |
| మూడవ | ” | 1992 | ” | 1000 |
| నాల్గవ | ” | 2008 | ” | 3000 |
| ఐదవ | ” | 2014 | ” | 3000 |
| ఆరవ | ” | 2018 | ” | 3000 |
| ఏడవ | ” | 2022 | ” | 3000 |
| ఎనిమిదవ | ” | 2025 | ” | 1000 |
| తొమ్మిదవ | ” | 2026 | ” | 2000 |

**ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన**

# బైబిలు మిషను ప్రచురణ

బైబిలుమిషను ప్రెస్, పెదకాకాని,

గుంటూరు – **522509.** ఫోన్: **9949121777.**

Bible Mission HQ Guntur

# పరిచయం

ప్రియ చదువరులకు!

హవ్వతోటలో సాతానువల్ల శోధింపబడి దేవుడు తినవద్దని చెప్పిన పండ్లను తినుటకు చెట్టువద్దకు వెళ్ళి కోయునప్పుడు దేవుడు అవ్వా! కోయవద్దు అన్న ఇంత ముప్పురాదు కదా! దేవుడు ఎందుకు ఊరుకొన్నాడని ప్రశ్నించుచున్నారు. ఆ సమయమందు అవ్వా! ఆగుమని దేవుడు పలికిన హవ్వయొక్క స్వాతంత్ర్య లక్షణమును దేవుడు ఆపివేసినట్టే అన్ని లక్షణములను వినియోగించుటకొనుటకు స్వాతంత్ర్య లక్షణమే సాధనము. అది ఆగిపోయన అన్ని లక్షణములు ఆగిపోవును. మెయిన్ స్విచ్ ( Main Switch) ఆపివేసిన అన్ని దీపములు ఆరిపోవును. అట్లే హవ్వలోని జీవము మొదలైన అన్ని లక్షణములు, ఆగిపోవును గనుక ఆగుమని దేవుడు ఆపలేదు. ఆపకపోవుట న్యాయమే. దేవుని న్యాయలక్షణము మనకు అర్థముకాదు. దేవునిలక్షణములు అన్నియు ఒకదానితో ఒకటి ఏకమైయున్నవి. హవ్వ పండుతిని చనిపోయిన దేవుడు బ్రతికించుకొనును, గాని దేవుడే అవ్వా! ఆగుమని పలికి చంపివేసిన ఇక బ్రతికించువారెవరు? అందుకనే దేవుడు ఊరుకొనెను. ఇదే దేవుడు ఊరుకొనుటవలన కలిగిన మేలు. ఇదే దేవుని నిశ్శబ్ద లక్షణము, దీనివలన కలిగిన మేలు హవ్వ విషయములో చూచుచున్నాము. ఇట్లు దేవుడు ఊరుకొను విషయములను బైబిలు చరిత్ర అంతటిలోను లోకాంతము వరకు జరుగు విషయములలోను, అనేకములు చూడగలము. మనకర్థమైనను అర్థము కాకపోయినను, దేవుని నిశ్శబ్ద లక్షణము మనకు ఉపయోగకరమైనదే గాని హానికరమైనదికాదు.

సాతాను పాడుకాగానే అప్పుడే అతనిని దేవుడు నాశనము చేయక ఎందుకు ఊరుకొనెనని అనేకులు ప్రశ్నించుచున్నారు. దేవుడు సృజించి కాపాడి, పోషించి రక్షించువాడు, కాని నాశనము చేయుటకు ఆయన లక్షణములు అంగీకరింపవు, హవ్వ పండు కోయునప్పుడు దేవుడు ఆపిన హవ్వ నాశనమగునని ఎరిగి ఊరుకొన్నట్టు ఈ ప్రధాన దూత తనలో దుర్బుద్ధి కలిగించుకొనినప్పుడు దేవుడు ఆపిన అప్పుడే ఆ దూత నాశనమగును. గనుక దేవుడు ఆపక ఊరుకొనెను. అతడు మారడని తెలిసినను అతనికి దేవుడు గడువు ఇచ్చుట ద్వారా దేవుని దీర్ఘశాంతమను

లక్షణము మరి ఎక్కువగా తెలియుచున్నది. దేవుడు ఎన్ని గడువు లిచ్చినను, చివరకు రక్షణ స్థితికి రాక నాశనమునకు పోవునప్పుడు దేవుడు ఊరుకొనక మరేమిచేయును?

వాక్యమైయున్న క్రీస్తుప్రభువుయొక్క అంతరంగము తెలిసికొని స్తుతించుభాగ్యము కలుగునుగాక! లోములో ఇన్ని చెడు కార్యములు జరుగుచుండగా మానవులు ఇన్ని కష్టములు అనుభవించుచుండగా, నీతిమంతులు శ్రమలుపడుచుండగా, దేవుడు ఇవన్ని చూచి ఎందుకు ఊరుకొన్నాడు? అను ప్రశ్న మానవునిలో కలదు. దేవుని కార్యములు గ్రహించలేక ఆయనను అపార్థము చేసికొనువారు, ఆయనను దూషించువారు, ఆయన అసలు లేనేలేడనువారును, లోకములో గలరు. అట్టి వారికి ఈ పుస్తకము కొంతవరకు జవాబిచ్చును. పరిమితిగల మానవ జ్ఞానము అపరిమితమైన దేవుని జ్ఞానమును ఎట్లు గ్రహింపగలదు? ఈ ప్రసంగములు దేవుని సహవాసములో జీవించిన దైవజనుడైన యం. దేవదాసు అయ్యగారు చేసినవి. ఏ ప్రశ్నకైన జవాబు దొరుకునని మేము ఎరిగిన విషయము మనకు వచ్చు కష్టములకు, శ్రమలకు, వాటిని దేవుడు ఎందుకు రానిచ్చుచున్నాడను తలంపునకు చక్కని ఉపదేశము, జవాబులు ఈ పుస్తకమున గలవు. వాటిని చదివి గ్రహించుట వలన విశ్వాసి ప్రభువును స్తుతించగలరు. ఆత్మయందు ఆనందించగలరు. వీటిని బయలు పరచుటలో అనాది దేవుడైన క్రీస్తు ప్రభువుయొక్క అంతరంగ ఉద్దేశ్యము నెరవేరును గాక! దైవలక్షణములు మానవుని యెడల ఎట్లు పనిచేయు చున్నవో ఈ చిన్న పుస్తకము వలన తెలిసికొనగలరు. ప్రభువును స్తుతించగలరు. త్వరగా రానైయున్న పెండ్లికుమారుడైన క్రీస్తుప్రభువును ఎక్కువగా స్తుతించు అంతస్తు ఈ పుస్తకమువలన మీకు కలుగును గాక!

మొదట ఈ పుస్తకమును ప్రచురించినవారు **శ్రీమతి. పి.జె. గ్రేసమ్మ** గారు.

**గుంటూరు**
**2026**

**మహిమ పెండ్లికుమారుడైన ప్రభువునందలి**
**రెవ. డా॥ జే. శామ్యేల్ కిరణ్**
ప్రసిడెంట్, బైబిలుమిషను